


అభివృద్ధికి నోచుకోని బౌద్ధారామాలు

● అతిథిగృహం ప్రారంభమెప్పుడో...!

6



పేరు పెద్ద.. వసతులు చిన్న..

జిల్లా కేంద్రం.. పైగా పెద్దాసుపత్రి. పేరుకే పెద్ద కానీ సౌకర్యాల లేమితో చిన్నగా మారిపోయింది. గత ప్రభుత్వంలో ఆగమేఘాలపై పనులు చేసి 50 పడకలుగా ఉన్న దానిని 100 పడకలకు మార్చి ఆస్పత్రి ప్రారంభించినా ఆ మేరకు సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. ఇంకా 30 శాతం పనులు అలాగే ఉన్నా ప్రస్తుతం వాటి గురించి పట్టించుకునే వారే లేరు. ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలకు ట్రామా కేర్ సెంటర్ లేదు. కంటివైద్యుడు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రసూతి కేంద్రం లేదు.. స్కానింగ్ సెంటర్ గది ఉన్నప్పటికీ అందులో పరికరాలు లేకపోవడంతో అది అలంకారప్రాయంగానే ఉంది. ఆస్పత్రిలో నీటి సౌకర్యం లేదు. బోరు వేసినప్పటికీ దానికి కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీరు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు ఆస్పత్రిని వెంటాడుతున్నాయి.

● పెద్దాసుపత్రికి పురిటి నొప్పులు
● సిబ్బంది ఉన్నా రోగులకు తప్పని తిప్పలు
● ఇంకా అసంపూర్తిగానే ఆసుపత్రి అభివృద్ధి పనులు
● కంటి డాక్టర్ డిప్యుటేషన్‌తో రోగుల అవస్థలు
● లిఫ్ట్ లేక ఇబ్బంది పడుతున్న వృద్ధులు, గర్భిణులు, బాలింతలు
● వెంటాడుతున్న నీటి కొరత
● ఇదీ రాయచోటి ఏరియా ఆసుపత్రి దుస్థితి



రక్త పరీక్షలు చేస్తున్న ఒకేషనల్ కళాశాల విద్యార్థులు



నూతనంగా నిర్మించిన రాయచోటి ఏరియా ఆసుపత్రి భవనం

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని వంద పడకల పెద్దాసుపత్రి సమస్యలతో పురిటి నొప్పులు పడుతోంది. 50 పడకలుగా ఉన్న రాయచోటి ఏరియా ఆసుపత్రిని గత ప్రభుత్వంలో వంద పడకలకు మార్చి నూతన భవనాన్ని నిర్మించారు. అయితే అప్పట్లో ఎన్నికలు దగ్గర పడడంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి ఆగమేఘాలపైన పూర్తి స్థాయిలో పనులు చేపట్టకుండానే ఆసుపత్రిని ప్రారంభించారు. 24 మంది వైద్యులు ఉన్నా... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 54 ఏరియా ఆసుపత్రుల్లో రాయచోటి ఏరియా ఆసుపత్రి ఓపీలో ఏ-గ్రేడ్‌లో ఉన్నప్పటికీ సరైన సౌకర్యాలు లేక రోగులు నానా తంటాలు పడుతున్నారు. ఆసుపత్రి భవనం పనులు 70 శాతం మాత్రమే పూర్తి కాగా ఇంకా 30 శాతం పనులు పెండింగ్‌లో ఉండడంతో వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. ఈ ఆసుపత్రికి రాయచోటి నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు పీలేరు నియోజకవర్గంలోని కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం తదితర మండలాలతో పాటు కదిరి నియోజకవర్గంలోని ఎన్‌పీకుంట, గాండ్లపెంట, పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేటతో కలిసి సుమారు 15 మండలాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. దీనికి తోడు కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి రాయచోటి మీదుగా వెళుతుండడంతో ప్రతినిత్యం ఏదో ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరిగి తీవ్రగాయాలతో ఇక్కడికి వస్తున్నప్పటికీ ఇక్కట ట్రామా కేర్ సెంటర్ లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం ప్రమాద బాధితులను తిరుపతి, కడప ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు. అంతేగాక ప్రత్యేకంగా ప్రసూతి ఆసుపత్రి లేకపోవడం వలన గర్భిణులు చాలామంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ గడిచిన ఏడాది కాలంగా గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ అర్చన ప్రతినిత్యం 50 నుంచి 100 వరకు స్కానింగ్‌లు చేయడం చూస్తే ఈ ప్రాంతంలో రోగుల సంఖ్య ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఆసుపత్రిలో లిఫ్టు లేకపోవడంతో వృద్ధులు, గర్భిణులు, బాలింతలు రక్త పరీక్షలు, ఇతర వైద్య చికిత్సలకు భవనం పైభాగంలోకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అన్ని వైద్య సేవల గదులకు ఆక్సిజన్ ప్లాంట్ నుంచి పైపులైన్ కూడా పెండింగ్‌లో ఉండడంతో అత్యవసర సేవలకు వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఉన్న కంటి వైద్యుడిని డిప్యుటేషన్‌పై కడపకు బదిలీ చేయడంతో మూడు నెలలుగా కంటి వైద్య విభాగం మూతపడింది. అంతేగాక రోగులకు మందులు ఇచ్చే ఫార్మసిస్ట్‌ను కూడా పులివెందులకు బదిలీ చేయడంతో ఇక్కడ ఉన్న కాంట్రాక్టు వర్కర్లతోనే మందులు రోగులకు ఇప్పించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వైద్య సేవల విభాగాలలో చాలా చోట్ల పూర్తి స్థాయిలో ఫర్నీచర్ లేదు. వంద పడకల ఆసుపత్రి కాకుండా రోజుకు 800 నుంచి 900 మంది రోగులు వస్తున్నా పెద్దాసుపత్రికి నీటి కొరత వెంటాడుతోంది. ఆసుపత్రి ఆవరణంలో బోరు ఏర్పాటు చేసినప్పటికీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతానికి వెలిగల్లు ప్రాజెక్టు నుంచి వచ్చే నీటితోనే సరిపెట్టుకుంటున్నారు. ఆసుపత్రి చుట్టూ ఉండే ప్రహరీ పూర్తి చేయకపోవడంతో పశువులు, కుక్కలు ఆసుపత్రిలోకి వస్తుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేగాక ఆసుపత్రి పడమర భాగంలో గేటు ఏర్పాటు చేసినప్పటికీ అటువైపు నుంచి ఆసుపత్రికి వచ్చేందుకు వీలు లేకుండా గేటుకు తాళాలు వేయడంతో పడమర భాగం నుంచి వచ్చే ఎంతోమంది రోగులు ఆసుపత్రి చుట్టూ తిరుక్కుని రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో పారిశుధ్యం చర్యలు చేపట్టేందుకు 16 మంది సిబ్బంది ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో పారిశుధ్యం కనబడడం లేదు. ప్రస్తుతం 14 బెడ్స్‌తో డయాలసిస్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. స్కానింగ్ చేయాల్సిన సిటీ స్కాన్ సెంటర్ గది ఉన్నప్పటికీ దానికి అవసరమైన పరికరాలు లేకపోవడంతో ఆసుపత్రి ప్రారంభం నుంచి నేటి వరకు సిటీ స్కానింగ్ సెంటర్ గది మూతపడి ఉంది. ఇలా చెప్పుకుంటూపోతే ఏరియా ఆసుపత్రిలో ఎన్నో రకాల సమస్యలు ఉన్నాయి.

ఉన్న సౌకర్యాలతోనే మెరుగైన వైద్యం..



రాయచోటి ఏరియా ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలతోనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఆసుపత్రిలో వైద్యులు పూర్తి స్థాయిలో ఉన్నారు. కంటి డాక్టర్ బదిలీ కావడంతో ఆ స్థానంలోకి ఎవరూ రాక కంటి రోగులకు ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. అక్టోబరులో 24,528 మందికి ఓపీ చూడడంతో రాష్ట్రంలోని అత్యధిక ఓపీ కలిగిన ఆసుపత్రుల్లో రాయచోటి మొదటి స్థానంలో నిలిచింది. ట్రామా సెంటర్ కోసం ప్రతిపాదనలు పంపాము. అంతేగాక డయాలసిస్ కేంద్రంలో 14 బెడ్స్ నుంచి 20 బెడ్స్‌కు పెంచేందుకు ఆసుపత్రిని 100 నుంచి 150 పడకలకు పెంచేందుకు, ప్రత్యేక ప్రసూతి వైద్యశాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాము. గుండెనొప్పితో అత్యవసరంగా వచ్చే వారికి ఈసీజీ కూడా తీసే సౌకర్యం ఇక్కడ ఉంది. గత నెలలో ఇరువురికి గోల్డెన్ అవర్స్ కింద రూ.40 వేల విలువ చేసే ఇంజక్షన్ ఇచ్చి వారిని మెరుగైన వైద్యం కోసం బయటికి పంపించాము.

- డాక్టర్ డేవిడ్‌కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్



ఆసుపత్రిలో మూలనపడి ఉన్న 104 వాహనాలు

ఎట్టకేలకు కదలిక

● రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు మోక్షం
● డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవ
● అధికారులతో కలిసి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్



కోడూరు-వెంకటగిరి రోడ్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా మరుగునపడిన రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు మోక్షం కలగనుంది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చొరవతో గురువారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆ రోడ్డును పరిశీలించారు. వివరాలిలా ఉన్నాయి. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న కోడూరు-వెంకటగిరి రోడ్డును పూర్తి చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా పవన్‌కళ్యాణ్, చంద్రబాబు హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు గురించి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఇటీవల విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే రోడ్డును పరిశీలించి నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యేతో పాటు రైల్వేకోడూరు ఆర్‌అండ్‌బీ డీఈ జయప్రకాష్ తన సిబ్బందితో కోడూరు మెయిన్ రోడ్డు నుంచి ఎస్‌ఆర్ కాలనీ అవతలి వరకు రోడ్డును పరిశీలించారు. రోడ్డు ఎంత వరకు పూర్తయింది, అడవిలో ఎంత దూరం వరకు వస్తుంది, అటవీ అనుమతులు తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. అదేవిధంగా వెంకటగిరి నుంచి ఎంత వరకు రోడ్డు నిర్మాణం సాగింది ఆ రోడ్డు ఏ స్థాయిలో ఉంది అనేది వెంకటగిరి జనసేన నాయకులు పరిశీలించారని ఎమ్మెల్యే తెలిపారు. త్వరగా నివేదికలు తయారు చేసి పంపాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఎమ్మెల్యే వివరించారు. కోడూరు నుంచి వెంకటగిరి వరకు 25.8 కిలోమీటర్లు ఉంటుందని గతంలో అధికారులు అంచనాలు వేశారని, ఇప్పటికి రైల్వేకోడూరు నుంచి 8.9 కిలోమీటర్లు, వెంకటగిరి నుంచి 6 కిలోమీటర్ల దూరం వరకు రోడ్డు వేశారని ఆర్‌అండ్‌బీ డీఈ తెలిపారు. 10.9 కిలోమీటర్లకు అటవీ అనుమతులకు కావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాజుగుంట జనసేన నాయకుడు గుత్తి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

12 మంది స్మగ్లర్ల అరెస్టు

● 20 దుంగలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

6

మహర్దశ వచ్చేనా..

● వైసీపీ పాలన రైతులకు శాపం
● ఐదేళ్లుగా కుంటలు, చెరువులు అభివృద్ధికి దూరం

6



గుంతలు లేని రహదారులే లక్ష్యం

● వైసీపీ హయాంలో ఆర్‌అండ్‌బీ నిర్వీర్యం
● ఐదేళ్ల పాలనలో గంప మట్టి కూడా రోడ్లపై వేయలేదు
● జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఒంటిమిట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రహదారిని నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌అండ్‌బీ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి వెళ్లే దారి వద్ద టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డితో కలిసి రోడ్డుపై తారువేసి గుంతలను పూడ్చే పనులను చేపట్టారు. ముందుగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ శాఖ నిర్వీర్యం అయిపోయిందని, ఐదు సంవత్సరాల్లో రహదారులకు గంప మట్టి వేసిన దాఖలాలు కూడా లేవని విమర్శించారు. గుంతల రోడ్లపై ప్రజల ఇబ్బందులను చూసిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో రోడ్లకు రూ.861 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. మొదటి విడతలో కడప జిల్లాలో 269 పనులకు రూ.33.58 కోట్ల రూపాయల పనులను చేపడుతున్నామన్నారు. రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలో గుంతలు లేని రహదారిని నిర్మించడమే తమ సంకల్పమన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈలు మాధవి, నాగేశ్వర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సహదేవరెడ్డి, జేఈ గంగిరెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్డీవో వెంకటపతి, తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐ శివప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు కొమరా వెంకటనరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సిద్దవటం మండల పార్టీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్వీర్యం చేసింది వైసీపీనే

రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీంలను నిర్వీర్యం చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోమశిల వెనుకజలాల ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీరందించే పైపులైన్లను పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వెంటనే చెరువుకు నీరందించే పైపులైను మరమ్మతులు చేపట్టాలని, నూతన పైపులైను నిర్మాణం కోసం రూ.10 కోట్లు కేటాయించాలని రైతులు, టీడీపీ నాయకుడు కొమరా వెంకటనరసయ్య విన్నవించారు. అలాగే పెన్నపేరూరు గ్రామంలోకి సోమశిల బ్యాక్‌వాటర్ వస్తోందని, మాకు ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేయడం కానీ లేదా పరిహారం ఇవ్వాలని, వైసీపీ నాయకులు మా భూములన్నీ ఆక్రమించారని చర్యలు తీసుకోవాలని కోరారు.



ఒంటిమిట్ట వద్ద రోడ్డుపై తారు వేసి గుంతలు పూడ్చుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

నూరుశాతం పెన్షన్లు పంపిణీ చేయాలి

● పల్లె పండుగ పనులపై దృష్టి సారించండి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 30వ తేదీ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను 100 శాతం పంపిణీ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్‌కలెక్టర్లు, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్, హౌసింగ్, ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఈవోలు, సచివాలయ సిబ్బంది తదితరులతో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలు తదితరాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30వ తేదీ పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది అందరూ తెల్లవారుజామున 5.30 గంటలకే క్షేత్రస్థాయిలో ఉండాలని, ఉదయం 6 గంటలకు తప్పనిసరిగా పెన్షన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవాలని తెలిపారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. సీఎంవో కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదులపై తహసీల్దార్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరించాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ శాఖ వారికి కేటాయించిన రహదారుల పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ అంశంలో వీరబల్లి, నందలూరు, కోడూరు, చిట్వేలి మండలాలు ప్రగతిలో వెనుకబడి ఉన్నాయని అక్కడ పురోగతి సాధించాలని తెలిపారు. ఎంఈవోలు, ఎంపీడీవోలు సమన్వయంతో విద్యార్థులకు అపార్ ఐడీలను త్వరగా మంజూరు చేయాలన్నారు. సర్వే రాళ్లపై ఉన్న చిత్రాలను తొలగించే పనిలో పూర్తిగా నిమగ్నమై త్వరితగతిన చిత్రాలను తొలగించాలన్నారు. హౌస్‌హోల్డ్ జియో ట్యాగ్ అంశంలో లక్ష్యాలను అందుకోవాలన్నారు. ఈ అంశంలో ప్రస్తుతం రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉన్నామని అందుకు కృషి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదనరావు, సబ్ కలెక్టర్‌లు మేఘస్వరూప్, నిదియాదేవి, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'సాగునీటి' ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

● డిసెంబరు 5న ప్రకటన.. 8న ఎన్నికలు : కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ ద్వారా సాగునీటి వినియోగదారుల సంఘ ఎన్నికలపై జిల్లా నీటి వనరులశాఖ, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంద ఎకరాలకుపైబడి ఆయకట్టు కలిగిన 167 చెరువులకు సంబంధించి డిసెంబరు 5న ఎన్నికల ప్రకటన, 8న వినియోగదారుల/సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. ఇందులో నామినేషన్లు ప్రక్రియ, 6 మంది ప్రాదేశిక సభ్యుల, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికలను పార్టీలకతీతంగా మంచి వాతావరణంలో వీలైనంత వరకు ఏకగ్రీవ తీర్మానాలతో జరపాలని ప్రభుత్వం భావిస్తోందని ఆ మేరకు జిల్లాలో కూడా పటిష్ఠంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్, నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు చేస్తేనే బీమా

● పంటల బీమాపై ప్రభుత్వం కొత్త నిర్ణయాలు
● బీమాపై రైతులకు అవగాహన సదస్సులు

మదనపల్లె మండలం పూలవాండ్లపల్లె వద్ద సాగులో ఉన్న వరి పంట



మదనపల్లె టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో రైతులు పండించే పంటలకు చెల్లిస్తున్న బీమా ప్రీమియం దుర్వినియోగం కావడంతో ప్రస్తుతం ప్రభుత్వం కొత్త నిర్ణయాలు తీసుకుంది. ఎవరైతే రైతులు రికార్డుల్లో కాకుండా క్షేత్రస్థాయిలో పంటలను సాగు చేస్తారో వారికే పంట నష్టం బీమా ప్రీమియం చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా రైతు సేవా కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులు పండించిన పంటను గుర్తించి నివేదికలు ఇచ్చాకే ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లిస్తోంది. గతంలో మాదిరి కాకుండా వాతావరణ ఆధారిత బీమా, పంట దిగుబడి నష్టం బీమా వేర్వేరుగా నమోదు చేసి రైతులకు న్యాయం చేస్తున్నారు.

రబీలో వివిధ పంటల సాధారణ సాగు

జిల్లాలో ఈ రబీ సీజన్‌లో పలు రకాల పంటల సాధారణ సాగుగా వ్యవసాయశాఖ అధికారులు వివరాలు సేకరించారు. ఇందులో వరి 6,885 హెక్టార్లు, జొన్న 24 హెక్టార్లు, మొక్కజొన్న 682 హెక్టార్లు, రాగి 40 హెక్టార్లు, ఉలవలు 4,638 హెక్టార్లు, అనుములు 9,420 హెక్టార్లు, సన్‌ఫ్లవర్ 809 హెక్టార్లుగా నిర్ణయించారు. మొత్తం అన్ని పంటలు కలిపి జిల్లాలో ఈ రబీ సీజన్‌లో 23,978 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయనున్నారు. వీటిలో గుర్తించిన పంటలకు మాత్రమే రెండు రకాల పంటనష్టం బీమా వర్తింపజేయనున్నారు.

వాతావరణ ఆధారిత బీమా పథకం

రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలు ఏదైనా వాతావరణ వైపరీత్యాలతో నష్టపోతే అందుకు పరిహారం చెల్లించే బీమానే వాతావరణ ఆధారిత బీమా అంటారు. ముఖ్యంగా అధిక వర్షపాతం, అల్ప వర్షపాతం, వేగంగా వీచిన గాలులు, వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండటం, ఉష్ణోగ్రత ఎక్కువ ఉండటం తదితర అంశాలను పారామీటర్స్ తీసుకుని వాతావరణ ఆధారిత బీమాను రబీ పంటలకు వర్తింప జేస్తారు. జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్‌లో టమోటా, వేరుశనగ లాంటి వాణిజ్య పంటలతో పాటు వరి పంట సాగు చేస్తున్నారు.

దిగుబడి ఆధారిత బీమా పథకం

రబీ సీజన్‌లో సాగు చేసే రైతుల పంటలకు దిగుబడి ఆధారిత బీమా పథకంలో కొన్ని మార్పులు చేశారు. ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా పథకం కింద పంట దిగుబడిని పంటకోత ప్రయోగాలతో లెక్క వేస్తారు. గతంలో ఏడు సంవత్సరాల్లో ఎంత పంట దిగుబడి వచ్చిందో గుర్తించి అందులో ఐదు సంవత్సరాల్లో వచ్చిన దిగుబడిని లెక్కవేస్తారు. ఇండెమ్నిటీ లెవెల్ వరి పంట దిగుబడి 80 శాతం రాకుంటే దిగుబడి తగ్గినట్లు లెక్క వేసి ఈ బీమా వర్తింప జేస్తారు. ఇందులో టమోటా పంట సాగు చేసిన రైతులు వారి వాటాగా ఎకరాకు రూ.1600, వేరుశనగకు రూ.96, వరి పంటకు 126 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలతో బీమా

వాతావరణ ఆధారిత, పంట దిగుబడి ఆధారిత బీమా పథకాల కోసం పలు ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకు వచ్చాయి. వీటిలో దిగుబడి ఆధారిత బీమా పథకాలను ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ కంపెనీ, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు పంట బీమాలు చేస్తున్నాయి. అలాగే వాతావరణ ఆధారిత బీమాను ఇఫ్కో, టోకియో, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు చేస్తున్నాయి. ఒకవేళ రైతులు పంట రుణాల కోసం బ్యాంకులకు దరఖాస్తు చేసుకుంటే, బ్యాంకులు రుణాలు మంజూరు చేసేటప్పుడే బీమా ప్రీమియం సొమ్ములు పట్టుకుని మిగిలిన మొత్తాన్ని రైతులకు అందిస్తారు. బీమా ప్రీమియంను బ్యాంకులే ఆయా ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లిస్తాయి. దీని వలన రైతులకు సమయం కలసివస్తుంది. ఇకపోతే రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి వారు సాగు చేసిన పంట వివరాలను సేకరించాలి. అలాగే వాతావరణ, దిగుబడి ఆధారిత బీమాల గురించి అవగాహన కల్పించి రైతుల చేత వారి వాటాగా ప్రీమియం చెల్లించేలా చూడాలి. కాగా డిసెంబరు 15వ తేదీ నాటికి అన్ని రకాల పంట బీమా ప్రీమియంలు చెల్లించాలని ప్రభుత్వం రైతులకు అన్ని ప్రసార సాధనాల్లో వివరించడంతో పాటు, వ్యవసాయశాఖ అధికారులతో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. రైతులు వారి ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, కౌలు రైతులైతే కౌలు సర్టిఫికెట్, మొబైల్ నెంబర్ వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం మీద ఈసారి వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారిత బీమాలు నమోదు చేయడంతో పాటు రైతుల నుంచి ప్రీమియంలు చెల్లించేలా ఆర్‌ఎస్‌కే సిబ్బందిని ప్రతి రోజూ ఉన్నతాధికారులు మోటివేట్ చేస్తూ ప్రతిరోజూ ప్రగతి నివేదికలు తెప్పించుకుంటు న్నారు. కాగా డిసెంబరు నెలాఖరుకి రబీ సీజన్‌లో నాట్లు పూర్తి కానున్నాయి.



కృష్ణారెడ్డి చెరువు, మొరవకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

మహర్దశ వచ్చేనా...

- వైసీపీ పాలన రైతులకు శాపం
- ఐదేళ్లుగా కుంటలు, చెరువులు అభివృద్ధికి దూరం
- డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు
- పింఛా ప్రాజెక్టు, నాలుగు చెరువులకు ఎన్నికలు



పింఛా ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వృథా అవుతున్న నీరు

సుండుపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు పరిధిలోని చెరువులకు వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. సుండుపల్లె మండలంలో వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న చెరువులను పట్టించుకోకపోగా, కనీసం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో యాజమాన్యం లేక దీనస్థితికి చేరుకున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు కూటమి నేతలు చెబుతున్నారు. అందులో భాగంగా డిసెంబరు 8న పింఛా ప్రాజెక్టు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటి వాగుచెరువు, ఊటచెరువు, నారాయణరెడ్డి చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్నికల అధికారులుగా తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఏఈ, మండల విద్యాశాఖ అధికారులు 1, 2లు వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. పింఛా ప్రాజెక్టుతో పాటు నాలుగు చెరువుల కింద సుమారు 3,127 మంది ఆయకట్టు రైతులు ఉన్నారు. నీటి సంఘం ఎన్నికలతో ప్రధాన చెరువులు, ప్రాజెక్టుకు మంచి రోజులు రానున్నాయని కూటమి నేతలు, రైతులు చెబుతున్నారు.

పింఛా ప్రాజెక్టుకు జగన్ పాలన శాపం

యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టుకు జగన్‌మోహన్‌రెడ్డి పాలన శాపంగా మారిందని ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం పాలనలో నీటి సంఘం ఎన్నికలు నిర్వహించి, కుడి, ఎడమ కాలువలకు రక్షణ గోడలతో పాటు ఇతర పనులను నిర్వహించారు. ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి కాలపరిమితి పూర్తయింది. ఆ తర్వాత ప్రాజెక్టు పనుల కోసం ఒక రూపాయి కేటాయించకపోవడం, ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోవడం, వంటి కారణాలతో ప్రాజెక్టుతో పాటు కాలువలు దీనస్థితికి చేరుకున్నాయి. ఎడమ కాలువలకు కుర్వపల్లి సమీపంలో రక్షణ గోడలు తెగిపోయి నీరు వృథా అవుతోంది. కుడి, ఎడమ కాలువలపైన పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇంకా అనేక సమస్యలతో ప్రాజెక్టు కాలువలు రైతులకు సాగునీటిని అందించలేకపోతున్నాయి. త్వరగా కాలువలకు పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు

డిసెంబరు 5న మండలంలోని పింఛా ప్రాజెక్టుతో పాటు నాలుగు చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలలకు నోటిఫికేషన్ విడుదలవుతుంది. డిసెంబరు 8న ఎన్నికలు నిర్వహించనున్నాం. నీటి సంఘం ఎన్నికలు జరిగితే ప్రాజెక్టు, చెరువుల అభివృద్ధికి నిధులు వస్తాయి.

- నాగేంద్రనాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సుండుపల్లె

రూపురేఖలు కోల్పోతున్నాయి

సుండుపల్లె మండల వ్యాప్తంగా 113 చెరువులు, కుంటలుండగా, ప్రధానంగా నాలుగు చెరువులకు నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. కొన్ని చెరువుల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. కొన్ని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువులు, కుంటల ఆక్రమణలపైన రెవెన్యూ అధికారులకు కూటమి నాయకులు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు జరగాల్సిన ఊటచెరువు మొరవకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చెరువుకట్టపై కంపచెట్లు పెరిగిపోయాయి. నారాయణరెడ్డి చెరువు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటివాగు చెరువులను ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో రూపు కోల్పోతున్నాయి. కృష్ణారెడ్డి చెరువులో వర్షపు నీరు చేరినా లీకేజీలు రైతులను కలవరపెడుతున్నాయి. పూడిక పెరిగిపోయింది. కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూడిపోయి పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని స్థానిక రైతులు చెబుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఊట చెరువుకింద ఆరు ఎకరాల భూమి ఉంది. చెరువులో నీరు ఉంటే బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుంది. సాగు, తాగునీటి కష్టాలు ఉండవు. చెరువులను ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరు వు దగ్గరకు పోయేదానికి దారి కూడా సరిగ్గా లేదు. చెరువు చుట్టూ కంప చెట్లు పెరిగి పోయాయి.

- కృష్ణయ్యనాయుడు, రైతు, తిమ్మసముద్రం

రైతు ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి



రైతుల ద్రోహిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. రైతులకు ఉపయోగపడే నీటి సంఘం ఎన్నికలకు పక్కన పెట్టి ఐదేళ్ల కాలయాపన చేశాడు. ఝురికోన నుంచి కాలువలు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలను నీటితో నింపుతామని చెప్పి సుండుపల్లె ప్రజలను వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు మోసం చేశారు.

- విశ్వనాథనాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రైతుల ఘోష జగన్‌కు వినిపించలేదు



ఎన్నికలకు ముందు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటలను పట్టించుకోలేదు. వేల ఎకరాలకు సాగునీటిని అందించే పింఛా ప్రాజెక్టు దుస్థితికి జగన్ పాలనే కారణం. పింఛా ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి.

- గాజుల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు

12 మంది స్మగ్లర్ల అరెస్టు

20 దుంగలు స్వాధీనం : రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలతో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ వరప్రసాద్ తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం గడికోట రోడ్డులోని ఈడిగపల్లె సమీపంలో అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి 12 మంది స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం రాయచోటి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కృష్ణమోహన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. వీరబల్లి మండలంలోని గడికోట రోడ్డులో గల ఈడిగపల్లికి సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం భగత్‌సింగ్‌కాలనీకి చెందిన గాండ్ల లతీఫ్‌బాషా, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు జిల్లా అనైకట్ తాలూకాకు చెందిన దేవరాజ్, బలరామయన్, బాబు, దొరైస్వామి, నాగరాజ్, తిరుమన్నామలై జిల్లాకు చెందిన కుమరేషన్, శాంతకుమార్, గోవిందరాజ్, రామస్వామి, శివరాజ్, రామచంద్రన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ గల 20 దుంగలను, రూ.9 లక్షల విలువ గల ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్‌ఐలు మోహన్‌నాయక్, భక్తవత్సలం, శ్రీనివాసులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రజిని, ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డిలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

మైక్రో ఇరిగేషన్ సాగు పెంచుదాం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

గుర్రంకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో వ్యవసాయ సాగు పెంచాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. గుర్రంకొండ రైతు సేవా కేంద్రంలో గురువారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. గుర్రంకొండ మండలంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో 900 హెక్టార్లలో వ్యవసాయం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటికి 464 హెక్టార్లకు రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని సిబ్బంది పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన కల్పించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతికల్లా గుంతల రహిత రహదారులు

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు : జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జనార్దన్‌రెడ్డి



రాజంపేటలో దెబ్బతిన్న రోడ్ల ఫొటోలను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

రాజంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్రాంతి నాటికల్లా గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని ప్రాంతాల్లో రోడ్లను మరమ్మతులు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం నారావారిపల్లెలో సీఎం సోదరుడు నారా రామ్మూర్తినాయుడు కర్మ వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో రాజంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిపై ఫొటో ప్రదర్శన నిర్వహించగా వాటిని మంత్రి తిలకించారు. దెబ్బతిన్న రోడ్ల వివరాలను, గుంతలు పూడ్చే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి మంత్రిని స్వాగతించి ఇక్కడ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాల ప్రాంతానికి, ఆధ్యాత్మిక కేంద్రాలైన తాళ్లపాక మీదుగా రోడ్డు వేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా రాజంపేట టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టీ.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎన్వీ రమణ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాజంపేటలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని విన్నవించారు. రాజంపేట భువనగిరిపల్లె ముఖద్వారం వద్ద చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీ గజమాలలు వేసి స్వాగతించి సత్కరించారు. తదనంతరం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, కాకతీయ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాజంపేట పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ మండల నాయకులు మేకా నరసింహులు, జిల్లా బలిజసంఘం అధ్యక్షుడు టైల్స్ నరసింహ, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, దంతవైద్య నిపుణుడు డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

మదనపల్లె టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వేంపల్లె, చీకిలబైలు గ్రామ పంచాయతీల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం వేంపల్లె పంచాయతీ బార్లపల్లె వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కుమారిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద 96 టెట్రాప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే చీకిలబైలు గ్రామంలో వెంకటరమణ అలియాస్ సుల్తాన్‌ను అరెస్టు చేసి అతడి వద్ద 28 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండుకు పంపామన్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, కర్ణాటక మద్యం విక్రయాలు, గంజాయి విక్రయాలపై 9440902533 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగానాయక్, చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐ తల్లి హత్య కేసులో నిందితుడు అరెస్టు



మదనపల్లె అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి హత్య కేసులో నిందితుడు అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీలో కాపురం ఉంటున్న స్వర్ణకుమారిని సెప్టెంబరు 28న పూజ నెపంతో నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధిలో ఉంటున్న అనిల్‌కుమార్ ఇంట్లో పూజలో ఆమెను కూర్చోబెట్టి తలపై సుత్తితో మోది హత్య చేశారు. ఆమె ఒంటిపైన ఉన్న బంగారు నగలు దోచుకున్నారు. అనంతరం ఆమె మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా అయోధ్యనగర్‌లోని స్మశానంలో పూడ్చివేశారు. ఆమెను చంపడానికి నలుగురు పథకం పన్నారని, అందులో గతంలో ఇద్దరిని అరెస్టు చేయగా ప్రస్తుతం అనిల్‌కుమార్ అనే నిందితుడిని 28వ తేదీ గురువారం నిమ్మనపల్లె క్రాస్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అనిల్‌కుమార్ తల్లిని పోలీసులు అరెస్టు చేయాల్సి ఉంది. కార్యక్రమంలో తాలుకా ఎస్‌ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిపై విచారణ



వైద్యులను విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ బృందం

తంబళ్లపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి పూర్వపు వైద్యాధికారి వెంకట్రామయ్యపై డీసీహెచ్‌ఎస్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ బృందం గురువారం విచారణ చేపట్టింది. తంబళ్లపల్లె సీహెచ్‌సీ వైద్యాధికారిగా వెంకట్రామయ్య ఉన్న సమయంలో అదే ఆసుపత్రిలో పనిచేసే కొందరు వైద్యులు కొన్ని రోజుల కిందట వైద్యాధికారిపై కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టరు ఆయనను డిప్యూటేషన్‌పై బి.కొత్తకోటకు బదిలీ చేయగా అదే ఆసుపత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న తేజశ్వినిని ఇన్‌చార్జి వైద్యాధికారిగా నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్ నేతృత్వంలోని పీలేరు మెడికల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, రాయచోటి ప్రభుత్వాసపత్రి సీనియర్ అనస్తీషియన్ వెంకటశివ బృందం గురువారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి విచారణ నిమిత్తం వచ్చారు. తొలుత ఆసుపత్రిలోని నూతన భవనంలో వైద్యులతో సమావేశం నిర్వహించి అనంతరం విచారణ ప్రారంభించారు. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులను, నర్సులను, సిబ్బందిని ఒక్కొక్కరిని విడివిడిగా అన్ని అంశాలలో సమగ్ర విచారణ చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ విచారణ రాత్రి వరకు కూడా కొనసాగుతోంది. ఈ విచారణలో వెల్లడైన అంశాలను కలెక్టరుకు అందచేయనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. విచారణ నిమిత్తం జిల్లా వైద్యాధికారులు వచ్చారని తెలుసుకున్న ప్రజలు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటేషన్‌పై పంపిన వెంకట్రామయ్యను తిరిగి ఇక్కడే వైద్యాధికారిగా నియమించాలని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, స్థానికులు విచారణాధికారులకు వినతిపత్రం అందచేశారు. వెంకట్రామయ్య వైద్యాధికారిగా ఆసుపత్రిని ఎంతగానో అభివృద్ధి చేశారని..తంబళ్లపల్లెలోనే నివాసం ఉండి నిరంతరం ఆసుపత్రిని పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించేవాడని అధికారులకు తెలియచేశారు. వైద్యాధికారిపై కక్ష్యతో కొందరు వైద్యులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకుని నిరంతరం ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండే వైద్యాధికారి వెంకట్రామయ్యను డిప్యూటేషన్‌పై పంపడం సబబు కాదన్నారు. ఈ అంశాలను కలెక్టరుకు అందచేస్తామని విచారణాధికారులు తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని బౌద్ధారామాలు

● *అతిథిగృహం ప్రారంభమెప్పుడో...!*

నందలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమలోనే అత్యంత చారిత్రాత్మక ఆడపూరు ముక్తికనుమ వద్ద ఉన్న బౌద్ధారామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథిగృహం పూర్తయి దాదాపు 5 సంవత్సరాలు అవుతున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 2017లో పర్యాటక ప్రాజెక్టు నుంచి రాష్ట్ర పర్యాటకశాఖ బౌద్ధారామాల అభివృద్ధి కోసం రూ.1.30 కోట్లతో శంకుస్థాపన చేసి పర్యాటక అతిథిగృహంలో ధ్యానమందిరం, సమావేశ మందిరంతో పాటు పార్కు, మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయి.

అతిథిగృహంలో ప్రత్యేకంగా బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. క్రీ.పూ. 3 నుంచి 11వ శతాబ్దాల మధ్య నందలూరు బాహుదానది ఒడ్డున బౌద్ధారామాలు విరాజిల్లాయని దక్షిణ భారతదేశ పర్యటన చేసిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ప్రపంచానికి తెలియజేశారు. 1977లో అప్పట్లో రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరపగా 1979లో ముక్తికనుమపై 21 స్థూపాలు బయటపడ్డాయి.

అయితే అప్పట్లో ప్రభుత్వాలు సరైన ప్రచారాలు నిర్వహించకపోవడంతో బౌద్ధారామాల స్థూపాలకు తగినంత ఆదరణ లభించలేదు. గత ప్రభుత్వాలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేసినా నిర్మాణాలలో అలసత్వం, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించలేదు. ఇప్పటికైనా పర్యాటకశాఖ వారు అతిథిగృహాన్ని ప్రారంభించి మరిన్ని నిధులతో ప్రచారం చేస్తే సమీపంలోని సౌమ్యనాథ ఆలయం ఉండడంతో తప్పనిసరిగా భక్తులు, పర్యాటకులు బౌద్ధారామాల సందర్శనకు వస్తారని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు వీలవుతుందని స్థానికులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో అరుదుగా ఉన్న ఈ బౌద్ధారామాలను మరింత అభివృద్ధి పరచాల్సిన బాధ్యత పర్యాటకశాఖపై ఉంది.

ఆడపూరులోని బౌద్ధారామాలు





ముక్తికనుమ వద్ద నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం

చర్యలు తీసుకోవాలి



భారతదేశంలో గౌతమి బుద్ధుడి స్థూపాలు రెండు రకాలు. బుద్ధుడు మహా నిర్యాణం పొందిన తర్వాత ఆయన అవశేషాలపై నిర్మించినవి శారీరక స్థూపాలు కాగా ప్రత్యేక సందర్భాల్లో నిర్మించినవి ఉద్దేశిక స్థూపాలు. గుంటూరు జిల్లా అమరావతి, కృష్ణాజిల్లా ఘంటసాలలో శారీరక స్థూపాలు నిర్మించగా కడప జిల్లా నందలూరు వద్ద ఉన్న ఆడపూరు గుట్టలో ఉద్దేశిక స్థూపాలను తీర్చిదిద్దారు. ఇప్పటికైనా నందలూరు మండలంలోని చారిత్రక బౌద్ధారామాలను అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలో పర్యాటకరంగం వేగం అందుకుంటుంది.

- డాక్టర్ అరిగె రాంప్రసాద్, నందలూరు.

పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలి



మండలంలోని ఆడపూరు ముక్తికనుమల్లోని బౌద్ధారామాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలి. అక్కడ కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించిన అతిథిగృహాన్ని, పార్కును అందుబాటులోకి తేవాలి. చారిత్రాత్మక, ప్రాచీన బౌద్ధారామాలను అభివృద్ధిపరిచి వెలుగులోకి తేవాలి.

-జంబు సూర్యనారాయణ, సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

టెక్నాలజీ సాయం

ఇల్లు 6 అడుగులు పైకి...



కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేడు ఆధునిక టెక్నాలజీ అన్ని రంగాల్లో ఉపయో గపడుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఓ ఇల్లు రోడ్డు కంటే ఆరు అడుగులు తగ్గులోకి వెళ్లింది. దీంతో ఆ ఇంటిని పడగొట్టకుండా నూతన టెక్నాలజీ సాయంతో అధునిక పరికరా లను ఉపయోగించి పైకి లేపుతున్నారు. వివరాల్లోకి వెళితే...

కొండాపురం పట్టణంలో ప్రస్తుతం నాలుగులైన్ల జాతీయ రహదారి పనులు జరుగుతు న్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న సుధీర్‌శ్రేష్ఠి ఇల్లు రహదారి కంటే తగ్గులోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇదే నివాసంలో అతనికి కిరాణాషాపు ఉండగా తగ్గులో ఉంటే వ్యాపారం జరగదని భావించి.. ఇంటిని పడగొట్టకుండా పైకి లేపాలని నిర్ణయించు కున్నాడు. ఈ పనులను చెన్నైకు చెందిన ఓ సంస్థకు అప్పగించాడు. దీంతో వారు బేస్‌మెంట్ పైభాగం నుంచి ఇంటిని యథాతథంగా పైకి లేపుతున్నారు. బేస్‌మెంట్‌కు, ఇంటికి మధ్యలో పెద్ద పెద్ద జాకీలు ఉంచి, నూతన టెక్నాలజీ, అధునిక పరికరాల సహాయంతో సుమారు 6 అడుగులు పైకి లేపుతున్నట్లు ఇంటి యజమాని తెలిపారు. ఇళ్లు చెక్కు చెదరకుండా ఇంటిని పైకి ఎత్తుతున్నారు. ఈ ప్రక్రియలో కింద పరిచిన బండలు మాత్రమే పక్కకు తీస్తారని తెలిపారు. కాగా సుమారు 6 అడుగుల ఇళ్లు పైకి లేపడానికి సుమారు రూ.15 లక్షల వరకు వ్యయం అవుతోందని తెలిపాడు. కాగా, ఇంటిని యథాతదంగా పైకి లేపడాన్ని జనాలు ఆసక్తిగా చూస్తున్నారు.

బకాయిలుంటే కనెక్షన్ తొలగించండి

● మొండి బకాయిలకు రెడ్-కోర్టు నోటీసులు ● విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ



విద్యుత్‌శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ బకాయిలుంటే వెంటనే కనెక్షన్ కట్ చేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ కింది స్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మొండి బకాయి లున్న వారికి రెడ్ నోటీసులు ఇవ్వాలన్నారు. గురువారం కమలా పురం, ఎర్రగుంట్ల నగరపంచా యతీ, రూరల్ ఏరియాల్లో విద్యు త్ బకాయిల వసూళ్లపై ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బకాయిలు ఎక్కువగా ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. పెద్ద మొత్తంలో బకాయిలుండడం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని, ఇకపై ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించారు. బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, దయ చూపించే స్థితిలో సంస్థ లేదన్నారు. విద్యుత్ సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తోందన్నారు. మరొక నెల తర్వాత బిల్లు వసూ లు చేస్తోందన్నారు. వెరసి వినియోగదారులకు రెండు నెలల గడువునిస్తోందన్నారు. నిబంధనల ప్రకారం వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్తు బకాయిలు వసూళ్లు చేయాలని సూచించారు. నెలవారి విద్యుత్ బకాయిల వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు

● మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఆంధ్ర జ్యోతిలో అనాథలు, అభాగ్యులకు ఆసరా ఏది అనే శీర్షికపై ఆయన స్పందిస్తూ కడప మున్సిపల్ కార్పోరే షన్ పరిధిలో ప్రభుత్వం నాలుగు బ్యాక్‌వర్డ్ కమ్యు నిటీ డెవలప్‌మెంటు సొసైటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే మూడింటికి కాలప రిమితి పూర్తవడంతో వాటిలో ఉన్న నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ప్రస్తుతం జడ్పీ కార్యాలయ ఆవరణలో శ్రీవిజయసేవా సమితి ఆధ్వర్యంలో కొనసా గుతున్న నిరాశ్రయుల వసతి గృహంలో 50 పడకలతో వసతి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మరొక వసతి ఏర్పాటు చేసేందుకు విద్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ముందుకు వచ్చిందని.. దానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో నిరాశ్రయులకు వసతి కల్పించేందకు అన్ని చర్యలు చేపడతామని చెప్పారు.

తుఫాన్ ప్రభావం

నల్లబడ్డ వరిగింజలు

ఆందోళనలో రైతులు.. ఆదుకోవాలని వేడుకోలు



చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురి సిన వర్షం రైతులను నట్టేట ముంచింది. వర్షానికి వరి ధాన్యంలో దాదాపు పాతిక భాగం నల్లగింజగా మారాయి. దీంతో పెట్టిన ఖర్చులైనా వస్తాయా రావో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో చిన్నమాచుపల్లె, ఉప్పరపల్లె, రామనపల్లె గ్రామాలలో దాదాపు 800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే పలు రెవెన్యూ గ్రామాల్లో కోత దశపూర్తి కాగా ఈ మూడు రెవెన్యూ గ్రామాల్లో గురువారం నుంచి వరి కోతలు మొదలయ్యాయి. కోసిన వరి ధాన్యం తెచ్చి రైతులు కలాల్లో ఆరబోస్తున్నారు. అయితే పండిన వరి ధాన్యంలో ఎక్కువ నల్లగింజలు కనిపిస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నల్లబడ్డ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదని వాపోతున్నారు. ఈ విషయం వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు కోసిన ధాన్యం పరిశీలించి.. విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని.. ప్రభుత్వానికి కూడా నివేదికలు పంపి తగిన న్యాయం చేస్తామని చెబుతున్నారు. మరి నష్టపోయిన రైతులకు ఏ మాత్రం న్యాయం జరుగుతుందో చూడాలి.

జాతీయ పోటీలకు మాసాపేట విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యో తి): రాయచోటి పట్టణ పరిధిలోని మాసా పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా ర్థులు రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపు రంలోని వజ్రకరూరులో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీ ల్లో ఉమ్మడి కడప జిల్లా జట్టు ద్వితీయ స్థా నం సాధించి అరాఫత్ (10వ తరగతి) జాతీ యస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అంతే గాక ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి జిల్లా జట్టు నుంచి వెంకటేశ్, బి.భవంత్‌సాగర్ (9వ తరగతి)లు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని మంగళం జడ్పీ ఉన్నత పాఠశా లలో జరిగిన అండర్-14 బేస్‌బాల్ విభా గంలో కడప జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించగా అందులో ఎం.సంతోష్ (9వ తర గతి), బి.సంతోష్ (8వ తరగతి) ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపి కయ్యారు. గుంటూరులో జరిగిన అండర్-17 బేస్‌బాల్ విభాగంలో డి.శివరాం (10వ తర గతి) జాతీ యస్థాయి పోటీలకు ఎంపికయ్యా రు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యుడు శివకుమార్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ సుగవాసి ఆనందబాబు, 1వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌ప్రసాద్‌లు జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు ఉత్తన్న విద్యార్థుల క్రీడా పరికరాల కోసం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.

పోటాపోటీగా సాగిన ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

ఈస్ట్ గోదావరి, రెస్ట్ ఆఫ్ సెంట్రల్, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల విజయం



సాయిశ్రావణ్ (151 నాటౌట్), రేవంత్‌రెడ్డి, (131)

కడప స్పోర్ట్స్ నవంబర్ 28, (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 మెన్స్ ఇంటర్ జోనల్ ఒన్‌డే క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గురువారం వేర్వేరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో ఈస్ట్ గోదావరి జట్టు ప్రకాశం జట్టుపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనంతపురం జట్టుపై రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొం దింది. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టుపై 4వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. వివరాలిలా..

కేఓఆర్ఎం మైదానంలో ఈస్ట్ గోదావరి-ప్రకాశం జట్ల మధ్యసాగిన మ్యాచ్‌లో తొలుత టాస్‌నె గ్గిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 46.2 ఓవ ర్లలో 286 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో అభినవ్ 92 పరుగులు, రోహిత్ 77 పరుగులు సాధిం చారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు విజయానికి అవసరమైన 287 పరుగులను 47.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి సాధించింది. ఇందులో సాయిశ్రావణ్ పరుగుల మోత (151 నాటౌట్) మోగించాడు. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపుసాధించింది.


ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జో న్-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 50 ఓవర్లలో 203 పరుగులు చేసింది. ఇందులో కేఎస్ఎస్ రాజు 56 పరుగులు చేశా రు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 37.2 ఓవర్లలో 176 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపు సాధించింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్- రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్‌నార్త్ జోన్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 294 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఇందులో హర్షవర్ధణ్ 63 పరు గులు, సాయిపూర్ణతేజ 55 పరుగులు చేశారు. రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 45.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసి విజయబావుటా ఎగురవేసింది. ఇందులో రేవంత్‌రెడ్డి 131 పరుగులు చేయడం విశేషం.

నేటి నుంచి వైవీయూ డిగ్రీపరీక్షలు

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 29వ తేదీ నుంచి సెమిస్టరు పరీక్షలు నిర్వహించను న్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ క్రిష్ణారావు వెల్లడించారు. జిల్లాలోని 54 కేంద్రాల్లో 1,3, 5 సెమిస్టర్లకు సంబంధించి 20,819 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

మొదటి సెమిస్టరు 8,407 మంది, మూడో సెమిస్టరు 6903 మంది, ఐదో సెమి స్టరు 5509 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిచేందుకు వైవీయూ ఉన్నతాధికారుల మార్గదర్శకంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.



లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి

కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



మాట్లాడుతున్న కాత్యాయని విద్మహే

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలి గిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రసిద్ధ తెలుగు రచయిత్రి ప్రొఫెసరు కాత్యా యని విద్మహే అన్నారు. వైవీయూ ఆర్ట్స్ బి ల్డింగులో ప్రసిద్ధ తెలుగు రచయిత కేతు విశ్వనాథరెడ్డి జీవితం, రచనలపై నా దృష్టిలో పేరుతో సాహిత్య కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ వర్తమాన సామాజిక దుర్మార్గాలను సాంస్కృతిక కోణం నుంచి ఎదుర్కొన్న రచ యిత కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. కులమత అసంబద్ధాలు, అపోహలు తొలగిపోవాలంటే ఆయన కథలు చదవాలన్నారు. వర్తమాన సమాజానికి అవసరమైన లౌకిక ప్రజాస్వా మ్య భావనలు కలిగిన వ్యక్తి అన్నారు. విశ్వ నాథరెడ్డి తోటి విద్యార్థులతో స్నేహితంగా మెలుగుతూ జ్ఞాన చైతన్యం చేసేవారన్నారు. రిజిస్ట్రారు పద్మ మాట్లాడుతూ అభ్యుదయ రచయితగా రైతులు, పేదలు పీడితుల పక్షాన నిలిచిన గొప్ప రచయిత కేతు విశ్వనా థరెడ్డి అని తెలిపారు. వైవీయూ తెలుగుశాఖ ప్రొఫెసరు ఎంఎం వినోదిని, ప్రొఫెసరు ఈశ్వ ర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసరు గంగయ్య, తెలు గుశాఖ ప్రొఫెసరు రమాదేవి, విద్య సాంస్కృ తిక సేవా సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, క్రిష్ణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వల్లూరు వంశీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కడప నగరంలోని రాజీవ్‌పార్కు వద్ద ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అభిమానులు, మిత్ర బృందం

రైస్‌పుల్లింగ్ వ్యాపారం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైస్ పుల్లింగ్ వ్యాపారం పేరుతో మోసం చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలి పారు. మూలే వెంకటరమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగుళూరుకు చెందిన అగలి అపర్ణ, ఆమె భర్త జయశీలన్, అపర్ణ అక్క అరుణకుమారి, స్నేహితుడు రామాం జనేయులు, అపర్ణ కజిన్ సిస్టర్ శోభారాణి , ఆమె కొడుకు విష్ణుకుమార్ రాజులపై కేసు నమోదు చేశామన్నారు. కాగా, అరెస్టు అయిన వారిలో అపర్ణ, అరుణకుమారి, రామాంజనేయులు ఉన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు...

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ రోడ్డులోని రైల్వేబ్రిడ్జి కింద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కదిరి టౌన్‌కు చెందిన పూల సునీల్‌కుమా ర్, మహ్మద్‌నయాజ్, బిజినేవాలా చాంద్ బాషాలు గురువారం ఉదయం గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నా రు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి ముగ్గురిని అరె స్టు చేసి.. వారి వద్ద నుంచి కేజీ 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించామన్నారు.

'ఆగిపోయిన ఆలయాల పనులు పూర్తి చేయిస్తాం'

పులివెందుల టౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా పరిధిలో ఆగిపోయిన ఆల యాల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎండోమెంట్ అసిస్టెంటు కమిషనర్ మల్లి ఖార్జున ప్రసాద్ తెలిపారు. పులివెందు లలో గురువారం ఆయన అంకాలమ్మ తల్లి ,పడమటి వీరాంజనేయ, శ్రీమిట్టమల్లేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ పులివెందుల నియో జకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధి పనులు ఆగిపోయాయని.. ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లి పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. పులివెందుల ఎగ్జి క్యూటివ్ ఆఫీసరు వెంకటరమణ, ఇన్స్‌పెక్ట రు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పొలతలలో హుండీల ఆదాయం రూ.15 లక్షలు



స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పెండ్లిమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్ర మైన పొలతల క్షేత్రంలో గురువారం హుండీల లెక్కింపు కార్య క్రమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణా నాయక్ తెలిపారు. మల్లేశ్వరస్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవస్థానమైన పుట్ట ఆంజనేయస్వామి దేవస్థానాల హుండీలను దేవదాయ ధర్మాదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ ఆధ్వర్యంలో లెక్కించారు. మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.14,90,437, పుట్ట ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.34,190 మొత్తం రూ.15,24, 627 ఆదా యం వచ్చిందన్నారు. వీటితో పాటు సుమారు 60గ్రాముల బంగారు, 2.50కేజీల వెండి భక్తులు సమర్పించారన్నారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ ఫరూక్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ (రిమ్స్) ఏపీ ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వ హించారు. అధ్యక్షుడిగా రిమ్స్ డాక్టర్ ఫరూక్, కార్యదర్శి ఎస్ పీఎం అసోసియేట్ ప్రొఫెసరు డాక్టర్ సుబ్బరాయుడు, కోశాధి కారిగా జనరల్ సర్జరీ, అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ శ్రీధర్‌రె డ్డిలతో కూడిన కార్యదర్శవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికలకు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరాజు ఎన్నికల అధికారిగా ఉన్నారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం

● లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆంజనేయులు

రాయచోటిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌తో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఉద్యమంలా మొక్కల పెంపకం చేపడుతున్నామని ఆర్‌బీఐ ప్రతినిధి నవీన్‌చిరినెల్లి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజర్వు బ్యాంకు, జిల్లా లీడ్‌బ్యాంక్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ బాషా, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో జామ, మామిడి, నిమ్మ, జామ (నేరేడు), సపోటతో సహా వివిధ రకాల ఫలాలను ఇచ్చే మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ ప్రతినిధులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో మంత్రి, సుగవాసి భేటీ



సీఎం చంద్రబాబుతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, బాలసుబ్రమణ్యం

రాయచోటిటౌన్/రాజంపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌తో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి సుబ్రమణ్యంలు వేర్వేరుగా భేటీ అయ్యారు. గురువారం సీఎం సోదరుడు నారా రామ్మూర్తినాయుడు కర్మక్రియలు తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని నారావారిపల్లెలో జరిగిన సందర్భంగా హాజరైన సీఎం, నారా లోకేశ్‌తో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రాంమూర్తినాయుడు చిత్రపటానికి మండిపల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సుగవాసి మాట్లాడారు. అన్నమయ్య ప్రాజెక్టును, పింఛా ప్రాజెక్టులను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భగా పలు విషయాలపై ఆయన మాట్లాడారు.

మామిడికి బంక తెగులు

● ఆందోళనలో రైతులు



చెట్టు కింద మసికట్టిన బంక



తెగులు సోకడంతో మగ్గిపోతున్న పూత

సంబేపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మామిడి తోటలకు బంక తెగులు సోకింది. సీజన్ ఆరంభం నుంచి తెగుళ్లు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది తెగుళ్లతో పూత దశలో రైతులు నష్టపోయారు. దిగుబడి 30 శాతం లోపే రావడంతో నిరాశ చెందారు. మండల వ్యాప్తంగా 1800 హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ ఏడాది మామిడి తోటలో పూత ఇప్పటికే అక్కడక్కడ పూసింది. ప్రస్తుతం పొగమంచు కురుస్తుండడంతో పూత మసిబారిపోయి ఆకులపై బంక కారుతోంది. ఈ ఏడాది మామిడిపై తెగుళ్ల ప్రభావం ప్రారంభంలోనే కనిపించడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. తెగుళ్ల నివారణ కోసం రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టినా ప్రభావం కనిపించడం లేదని వాపోతున్నారు. గత 20 రోజుల నుంచి మామిడి తోటలో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాదైనా ఆశించిన లాభాలొస్తాయని రైతులు ఆశలు పెట్టుకొని ఉన్నారు. గతేడాది తోటలు కొనుగోలు చేసిన వ్యాపారాలు నష్టపోయారు. ఈ ఏడాది దిగుబడులు వస్తాయని భావించి ఇప్పటికే చాలా చోట్ల వ్యాపారాలు ప్రారంభించారు.

ఈ సారైనా దిగుబడి వచ్చేనా

- నాగిరెడ్డి, మాధంవాండ్లపల్లె, సంబేపల్లె



గతేడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించ లేదు. పూత వచ్చినా రాలిపోయింది. ఈ ఏడాది బంక తెగులు ఇప్పటికే కనిపిస్తోంది. ఈ సారైనా దిగుబడి వస్తుందా అన్న నమ్మకం లేదు. గత ఐదేళ్లుగా మామిడిలో ఆశించిన రీతిలో దిగుబడులు రాక రైతులందరూ నష్టపోతున్నాం. ఈ ఏడాదైనా దిగుబడి వస్తే అంతే చాలు.

మెనూ తప్పక పాటించి తీరాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి

పెనగలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు మెనూ తప్పక పాటించి తీరాల్సిందేనని పెనగలూరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి సూచించారు. గురవారం పెనగలూరు ప్రధాన అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ పరిధిలోని 26 మంది అంగన్వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రికార్డులు పెండింగ్ పెట్టుకోకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

రైల్వేకోడూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజమ్మ వీధిలోని గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమానికి విశేషంగా స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కో-ఆర్డినేటర్ సునీల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి, టాటా క్యాపిటల్ సంస్థ ప్రతినిధులు సంతోష్‌రాజు, అమరరాజ గ్రూప్ సంస్థ ప్రతినిధి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కమిటీ సభ్యుడిగా తల్లెం

రాజంపేటటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంతకల్ రైల్వేడివిజనల్ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఓబులవారిపల్లె మండలం మంగంపేట గ్రామానికి చెందిన తల్లెం భరత్‌కుమార్‌రెడ్డిని ఎంపిక చేస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో రైల్వేడివిజన్ సభ్యుడిగా పనిచేసి తిరిగి రెండోసారి ఎంపికయ్యారు. ఆయన మాట్లాడతూ తనను ఎంపిక చేసినందుకు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

శబరిమలకు మాలధారులు

నందలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యప్ప మాలధారులు గురువారం దాదాపు 40 మంది శబరిమలకు తరలివెళ్లారు. నందలూరు రైల్వేకేంద్రంలోని వరసిద్ధివినాయక ఆలయంలో మాల ధరించి దీక్ష చేపట్టిన అయ్యప్పస్వాములు భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మేడా వెంకటకుమార్, ఎల్లయ్య, మాకం వెంకటకుమార్, కె.వెంకటరమణ, కాకి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమిస్తాం'

గాలివీడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని స్థానిక సీపీఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 2266లో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఇష్టానుసారంగా వాటాలు పంచుకుని అక్రమంగా రేకులను ఏర్పాటు చేయడం వారి బరితెగింపునకు నిదర్శనమన్నారు. వెంటనే ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణమూర్తి, భాస్కర్‌యాదవ్, ఓబులేసు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కృష్ణప్రసాద్ బాధ్యతలు



ఒంటిమిట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ గురువారం అదనపు బాధ్యతలు తీసుకుని ఎంపీడీవోగా నూతన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సోమశేఖర్ ఏవోగా పనిచేస్తూ ఎఫ్ఎస్‌వో ఇన్‌చార్జి ఎంపీడీవోగా రెండు నెలల పాటు ఎంపీడీవోగా పనిచేశారు. వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని, మినీ గోకులాల విషయంలో ఆరోపణలు రావడంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, మంత్రి రాంప్రసాద్ దృష్టికి స్థానిక టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. వెంటనే ఎఫ్ఎస్‌వో బాధ్యతల నుంచి తొలగించి ఈవోపీఆర్డీకి అదనపు బాధ్యతలు ఇవ్వాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈ మేరకు కృష్ణప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.

జయంతి ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని వినతి

రాజంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డివిజనల్, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలని కోరుతూ బీజేపీ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్ సికింద్రాబాద్ రైల్వే నిలయంలో గురువారం ప్రిన్సిపల్ చీఫ్ మేనేజర్ పద్మజకు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రైల్వే అధికారులకు రాజంపేటలో స్టాపింగ్ విషయమై రాసిన ఉత్తరాన్ని అధికారులకు అందజేశారు. వెంటనే రాజంపేటలో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



ఒంటిమిట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ గురువారం విచారణ చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని విధుల్లో ఉన్న వీఆర్‌ఏ శాంతమ్మ అడ్డుపడడంతో ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన సుధాకర్ కులంపేరుతో దూషించి దుర్భాషలాడిన విషయంపై కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు స్థానిక పోలీసుస్టేషన్‌లో తహసీల్దారు రమణమ్మ సమక్షంలో విచారించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణంరాజునాయక్, ఎస్ఐ శివప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో టీడీపీ నేతల సంబరాలు



విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

రాజంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు పూర్తి చేసుకోవడమే కాకుండా రాష్ట్రంలో నెంబర్‌వన్ స్థానంలో నిలిచిన సందర్భంగా గురువారం రాజంపేట టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. చంద్రబాబు, లోకేశ్, సుగవాసి బాలసుబ్రమణ్యం నాయకత్వం వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ తదితరులు మాట్లాడారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



స్వామి అమ్మవార్ల కల్యాణ దృశ్యం

సిద్దవటం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం-1 గ్రామం ఎస్‌కేఆర్ నగర్ రామాలయంలో మంగళగౌరి సమేత శివపార్వతుల కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన్, కంకణధార, జిలకర బెల్లం, కన్యాదానం పూజా కార్యక్రమాలు జరిగాయి. కల్యాణ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ నాయకుడు అతికారి క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివపార్వతుల కల్యాణ మహోత్సవం తిలకించడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంజి సుబ్బరాయుడు, మునగపాటి సుబ్బరాయుడు, కుటుంబ సభ్యులు, కూటమి నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కలిసిన గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ తదితరులు

మహిళల విద్యా ప్రదాత పూలే

● ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి

సుండుపల్లె,నవంబరు28(ఆంధ్రజ్యోతి): మహిళల విద్యా ప్రదాత మహాత్మా జ్యోతిరావుపూలే అని ఎంఈఓ రవీంద్ర నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు మునిస్వామి, మంగిరి రమణ, జనసేన నాయకులు ఒంటేరు రాజా, రెడ్డిరాణి, వైసీపీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని రెడ్డిపల్లె జనసేన కార్యాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావుపూలే వేడుకలను జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిన్నయ్య, చెంగల్‌రెడ్డి, శివాజీ, లోహిత్, శివయ్య, జనార్దన్, మహేష్ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతిరావు పూలేనని ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు వెంకటనారాయణరెడ్డి, సుబ్బరాయుడు, రామచంద్రయ్య, పురుషోత్తం, చరణ్‌కుమార్, మణికంఠ, సతీష్‌కుమార్, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): సంఘ సేవకుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు అన్నారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

అమ్మవారికి రూ.8 లక్షలతో వెండి కవచం



రైల్వేకోడూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజవీధిలో వెలసి ఉన్న అంకాలమ్మ అమ్మవారికి రూ.8 లక్షల విలువైన 8 కిలోల వెండి కవచాన్ని తోట శివసాయి కుటుంబ సభ్యులు గురువారం వితరణ చేశారు. తమిళనాడులో బంగారు వ్యాపారి తోట యుగంధర్ తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

సభను విజయవంతం చేయండి : సీపీఐ

రాయచోటిటౌన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ అన్నారు. గురువారం ఆయన ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని కోరుతూ రాయచోటి పట్టణ పరిధిలో కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు రమణ, సుజాత, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై తనిఖీ

సిద్దవటం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ తనిఖీల్లో భాగంగా నవంబరు 29 నుంచి డిసెంబరు 5 వరకు సామాజిక తనిఖీలు ఉంటాయని ఎంపీడీవో ఫణిరాజకుమారి గురువారం తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం ఉపాధిహామీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సామాజిక ఉపాధిహామీ తనిఖీల్లో భాగంగా ప్రజాప్రతినిధులు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నరసింహులు, స్టేట్ రీసోర్స్‌పర్సన్ భాస్కర్, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

రాయచోటిటౌన్,నవంబరు28(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఏపీ ఎన్జీవో అసోసియేషన్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం పట్టణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్, రాయచోటి అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డిలు సంఘ సభ్యులతో కలిసి జిల్లా వైద్యశాఖలో నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఎన్జీవో నాయకులు దేవేంద్ర, మహబూబ్‌బాషా, శివారెడ్డి, సుగుణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సిద్దవటం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని, రాష్ట్ర పంచాయతిరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య అన్నారు. సిద్దవటం ఆకులవీధికి చెందిన పోలిశెట్టి శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ పథకం కింద రూ.3,70,800 మంజూరవడంతో ఆ చెక్కును బాధితుడికి గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కడితం రామ్మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తు అంధకారం

గాలివీడు, నవంబరు28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. ఆమె గురువారం మండల కేంద్రంలోని పక్కీర్‌రెడ్డిగారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై టీచర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని అరికట్టేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్ల చేత ప్రతిజ్ఞ చేయించి బాల్య వివాహాల నిషేధంపై పోస్టర్లను విడుదల చేశారు.

ఇన్‌చార్జి మంత్రికి వినతి

సుండుపల్లె, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రోడ్ల శాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డికి సుండుపల్లె సమస్యలపై వినతిపత్రం అందజేసినట్లు మండల అధ్యక్షుడు గురువారం తెలిపారు. రాయచోటికి వచ్చిన ఇన్‌చార్జి మంత్రికి మండలంలోని రహదారులు, డ్రైనేజీ సమస్యలతో పాటు రాయచోటి- సుండుపల్లె రోడ్డు పనులు ఆగిపోయాయని, ఆ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహర్దశ వచ్చేనా...

- వైసీపీ పాలన రైతులకు శాపం
- ఐదేళ్లుగా కుంటలు, చెరువులు అభివృద్ధికి దూరం
- డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు
- పింఛా ప్రాజెక్టు, నాలుగు చెరువులకు ఎన్నికలు


కృష్ణారెడ్డి చెరువు, మొరవకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు


పింఛా ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వృథా అవుతున్న నీరు

సుండుపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు పరిధిలోని చెరువులకు వైసీపీ ప్రభుత్వంలో గ్రహణం పట్టింది. సుండుపల్లె మండలంలో వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న చెరువులను పట్టించుకోకపోగా, కనీసం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో యాజమాన్యం లేక దీనస్థితికి చేరుకున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు కూటమి నేతలు చెబుతున్నారు. అందులో భాగంగా డిసెంబరు 8న పింఛా ప్రాజెక్టు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటి వాగుచెరువు, ఊటచెరువు, నారాయణరెడ్డి చెరువులకు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్నికల అధికారులుగా తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఏఈ, మండల విద్యాశాఖ అధికారులు 1, 2లు వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. పింఛా ప్రాజెక్టుతో పాటు నాలుగు చెరువుల కింద సుమారు 3,127 మంది ఆయకట్టు రైతులు ఉన్నారు. నీటి సంఘం ఎన్నికలతో ప్రధాన చెరువులు, ప్రాజెక్టుకు మంచి రోజులు రానున్నాయని కూటమి నేతలు, రైతులు చెబుతున్నారు.

పింఛా ప్రాజెక్టుకు జగన్ పాలన శాపం

యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టుకు జగన్‌మోహన్‌రెడ్డి పాలన శాపంగా మారిందని ప్రాజెక్టు దిగువ భాగంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం పాలనలో నీటి సంఘం ఎన్నికలు నిర్వహించి, కుడి, ఎడమ కాలువలకు రక్షణ గోడలతో పాటు ఇతర పనులను నిర్వహించారు. ఆ తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి కాలపరిమితి పూర్తయింది. ఆ తర్వాత ప్రాజెక్టు పనుల కోసం ఒక రూపాయి కేటాయించకపోవడం, ప్రాజెక్టు మట్టికట్ట తెగిపోవడం, వంటి కారణాలతో ప్రాజెక్టుతో పాటు కాలువలు దీనస్థితికి చేరుకున్నాయి. ఎడమ కాలువలకు కుర్వపల్లి సమీపంలో రక్షణ గోడలు తెగిపోయి నీరు వృథా అవుతోంది. కుడి, ఎడమ కాలువలపైన పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఇంకా అనేక సమస్యలతో ప్రాజెక్టు కాలువలు రైతులకు సాగునీటిని అందించలేకపోతున్నాయి. త్వరగా కాలువలకు పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు

డిసెంబరు 5న మండలంలోని పింఛా ప్రాజెక్టుతో పాటు నాలుగు చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలలకు నోటిఫికేషన్ విడుదలవుతుంది. డిసెంబరు 8న ఎన్నికలు నిర్వహించనున్నాం. నీటి సంఘం ఎన్నికలు జరిగితే ప్రాజెక్టు, చెరువుల అభివృద్ధికి నిధులు వస్తాయి.

- నాగేంద్రనాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సుండుపల్లె

రూపురేఖలు కోల్పోతున్నాయి

సుండుపల్లె మండల వ్యాప్తంగా 113 చెరువులు, కుంటలుండగా, ప్రధానంగా నాలుగు చెరువులకు నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. కొన్ని చెరువుల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. కొన్ని చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయి. చెరువులు, కుంటల ఆక్రమణలపైన రెవెన్యూ అధికారులకు కూటమి నాయకులు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు జరగాల్సిన ఊటచెరువు మొరవకు మరమ్మతులు చేయాల్సి ఉంది. చెరువుకట్టపై కంపచెట్లు పెరిగిపోయాయి. నారాయణరెడ్డి చెరువు, కృష్ణారెడ్డి చెరువు, గూనేటివాగు చెరువులను ఐదేళ్లుగా పట్టించుకోకపోవడంతో రూపు కోల్పోతున్నాయి. కృష్ణారెడ్డి చెరువులో వర్షపు నీరు చేరినా లీకేజీలు రైతులను కలవరపెడుతున్నాయి. పూడిక పెరిగిపోయింది. కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూడిపోయి పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని స్థానిక రైతులు చెబుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



ఊట చెరువుకింద ఆరు ఎకరాల భూమి ఉంది. చెరువులో నీరు ఉంటే బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుంది. సాగు, తాగునీటి కష్టాలు ఉండవు. చెరువులను ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరు వు దగ్గరకు పోయేదానికి దారి కూడా సరిగ్గా లేదు. చెరువు చుట్టూ కంప చెట్లు పెరిగి పోయాయి.

- కృష్ణయ్యనాయుడు, రైతు, తిమ్మసముద్రం

రైతు ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి



రైతుల ద్రోహిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. రైతులకు ఉపయోగపడే నీటి సంఘం ఎన్నికలకు పక్కన పెట్టి ఐదేళ్ల కాలయాపన చేశాడు. ఝరికోన నుంచి కాలువలు ఏర్పాటు చేసి చెరువులు, కుంటలను నీటితో నింపుతామని చెప్పి సుండుపల్లె ప్రజలను వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు మోసం చేశారు.

- విశ్వనాథనాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రైతుల ఘోష జగన్‌కు వినిపించలేదు



ఎన్నికలకు ముందు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులు, చెరువులు, కుంటలను పట్టించుకోలేదు. వేల ఎకరాలకు సాగునీటిని అందించే పింఛా ప్రాజెక్టు దుస్థితికి జగన్ పాలనే కారణం. పింఛా ప్రాజెక్టు కాలువలకు మరమ్మతులు చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలి.

- గాజుల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు

12 మంది స్మగ్లర్ల అరెస్టు

20 దుంగలు స్వాధీనం : రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్


పట్టుబడిన స్మగ్లర్లు, దుంగలతో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ వరప్రసాద్ తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం గడికోట రోడ్డులోని ఈడిగపల్లె సమీపంలో అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి 12 మంది స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గురువారం రాయచోటి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ కృష్ణమోహన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. వీరబల్లి మండలంలోని గడికోట రోడ్డులో గల ఈడిగపల్లికి సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణం భగత్‌సింగ్‌కాలనీకి చెందిన గాండ్ల లతీఫ్‌బాషా, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు జిల్లా అనైకట్ తాలూకాకు చెందిన దేవరాజ్, బలరామయన్, బాబు, దొరైస్వామి, నాగరాజ్, తిరుమన్నామలై జిల్లాకు చెందిన కుమరేషన్, శాంతకుమార్, గోవిందరాజ్, రామస్వామి, శివరాజ్, రామచంద్రన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ గల 20 దుంగలను, రూ.9 లక్షల విలువ గల ఒక ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పెట్టినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐలు మోహన్‌నాయక్, భక్తవత్సలం, శ్రీనివాసులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రజిని, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డిలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

మైక్రో ఇరిగేషన్ సాగు పెంచుదాం


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

గుర్రంకొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో వ్యవసాయ సాగు పెంచాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. గుర్రంకొండ రైతు సేవా కేంద్రంలో గురువారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలు లక్ష్యంగా నిర్ధేశించినట్లు తెలిపారు. గుర్రంకొండ మండలంలో మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో 900 హెక్టార్లలో వ్యవసాయం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటికి 464 హెక్టార్లకు రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని సిబ్బంది పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు మైక్రో ఇరిగేషన్‌పై అవగాహన కల్పించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతికల్లా గుంతల రహిత రహదారులు

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు : జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జనార్దన్‌రెడ్డి


రాజంపేటలో దెబ్బతిన్న రోడ్ల ఫొటోలను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

రాజంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్రాంతి నాటికల్లా గుంతల రహిత రహదారులే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని ప్రాంతాల్లో రోడ్లను మరమ్మతులు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం నారావారిపల్లెలో సీఎం సోదరుడు నారా రామ్మూర్తినాయుడు కర్మ వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో రాజంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా రాజంపేట ఆర్అండ్‌బీ అతిథిగృహంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిపై ఫొటో ప్రదర్శన నిర్వహించగా వాటిని మంత్రి తిలకించారు. దెబ్బతిన్న రోడ్ల వివరాలను, గుంతలు పూడ్చే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి మంత్రిని స్వాగతించి ఇక్కడ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాల ప్రాంతానికి, ఆధ్యాత్మిక కేంద్రాలైన తాళ్లపాక మీదుగా రోడ్డు వేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా రాజంపేట టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాజంపేటలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని విన్నవించారు. రాజంపేట భువనగిరిపల్లె ముఖద్వారం వద్ద చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భారీ గజమాలలు వేసి స్వాగతించి సత్కరించారు. తదనంతరం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, కాకతీయ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు శివకుమార్, రాజంపేట పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ మండల నాయకులు మేకా నరసింహులు, జిల్లా బలిజసంఘం అధ్యక్షుడు టైల్స్ నరసింహ, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, దంతవైద్య నిపుణుడు డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

మదనపల్లె టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం వేంపల్లె, చీకిలబైలు గ్రామ పంచాయతీల్లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. గురువారం వేంపల్లె పంచాయతీ బార్లపల్లె వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కుమారిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద 96 టెట్రాప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే చీకిలబైలు గ్రామంలో వెంకటరమణ అలియాస్ సుల్తాన్‌ను అరెస్టు చేసి అతడి వద్ద 28 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండుకు పంపామన్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, కర్ణాటక మద్యం విక్రయాలు, గంజాయి విక్రయాలపై 9440902533 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబీవుల్లా, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, రంగానాయక్, చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐ తల్లి హత్య కేసులో నిందితుడు అరెస్టు



మదనపల్లె అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి హత్య కేసులో నిందితుడు అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... కోళ్లబైలు పంచాయతీ జగన్ కాలనీలో కాపురం ఉంటున్న స్వర్ణకుమారిని సెప్టెంబరు 28న పూజ నెపంతో నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధిలో ఉంటున్న అనిల్‌కుమార్ ఇంట్లో పూజలో ఆమెను కూర్చోబెట్టి తలపై సుత్తితో మోది హత్య చేశారు. ఆమె ఒంటిపైన ఉన్న బంగారు నగలు దోచుకున్నారు. అనంతరం ఆమె మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా అయోధ్యనగర్‌లోని స్మశానంలో పూడ్చివేశారు. ఆమెను చంపడానికి నలుగురు పథకం పన్నారని, అందులో గతంలో ఇద్దరిని అరెస్టు చేయగా ప్రస్తుతం అనిల్‌కుమార్ అనే నిందితుడిని 28వ తేదీ గురువారం నిమ్మనపల్లె క్రాస్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అనిల్‌కుమార్ తల్లిని పోలీసులు అరెస్టు చేయాల్సి ఉంది. కార్యక్రమంలో తాలుకా ఎస్ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిపై విచారణ


వైద్యులను విచారిస్తున్న డీసీహెచ్ఎస్ బృందం

తంబళ్లపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి పూర్వపు వైద్యాధికారి వెంకట్రామయ్యపై డీసీహెచ్ఎస్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ బృందం గురువారం విచారణ చేపట్టింది. తంబళ్లపల్లె సీహెచ్‌సీ వైద్యాధికారిగా వెంకట్రామయ్య ఉన్న సమయంలో అదే ఆసుపత్రిలో పనిచేసే కొందరు వైద్యులు కొన్ని రోజుల కిందట వైద్యాధికారిపై కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టరు ఆయనను డిప్యూటేషన్‌పై బి.కొత్తకోటకు బదిలీ చేయగా అదే ఆసుపత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న తేజస్వినిని ఇన్‌చార్జి వైద్యాధికారిగా నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్ఎస్ డేవిడ్ సుకుమార్ నేతృత్వంలోని పీలేరు మెడికల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, రాయచోటి ప్రభుత్వాసుపత్రి సీనియర్ అనస్తీషియన్ వెంకటశివ బృందం గురువారం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి విచారణ నిమిత్తం వచ్చారు. తొలుత ఆసుపత్రిలోని నూతన భవనంలో వైద్యులతో సమావేశం నిర్వహించి అనంతరం విచారణ ప్రారంభించారు. ఆసుపత్రిలో పనిచేసే వైద్యులను, నర్సులను, సిబ్బందిని ఒక్కొక్కరిని విడివిడిగా అన్ని అంశాలలో సమగ్ర విచారణ చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ విచారణ రాత్రి వరకు కూడా కొనసాగుతోంది. ఈ విచారణలో వెల్లడైన అంశాలను కలెక్టరుకు అందచేయనున్నట్లు విచారణాధికారులు తెలిపారు. విచారణ నిమిత్తం జిల్లా వైద్యాధికారులు వచ్చారని తెలుసుకున్న ప్రజలు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటేషన్‌పై పంపిన వెంకట్రామయ్యను తిరిగి ఇక్కడే వైద్యాధికారిగా నియమించాలని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, స్థానికులు విచారణాధికారులకు వినతిపత్రం అందచేశారు. వెంకట్రామయ్య వైద్యాధికారిగా ఆసుపత్రిని ఎంతగానో అభివృద్ధి చేశారని..తంబళ్లపల్లెలోనే నివాసం ఉండి నిరంతరం ఆసుపత్రిని పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించేవాడని అధికారులకు తెలియచేశారు. వైద్యాధికారిపై కక్షతో కొందరు వైద్యులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకుని నిరంతరం ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండే వైద్యాధికారి వెంకట్రామయ్యను డిప్యూటేషన్‌పై పంపడం సబబు కాదన్నారు. ఈ అంశాలను కలెక్టరుకు అందచేస్తామని విచారణాధికారులు తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని బౌద్ధారామాలు

● అతిథిగృహం ప్రారంభమెప్పుడో...!

నందలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమలోనే అత్యంత చారిత్రాత్మక ఆడపూరు ముక్తికనుమ వద్ద ఉన్న బౌద్ధారామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథిగృహం పూర్తయి దాదాపు 5 సంవత్సరాలు అవుతున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 2017లో పర్యాటక ప్రాజెక్టు నుంచి రాష్ట్ర పర్యాటకశాఖ బౌద్ధారామాల అభివృద్ధి కోసం రూ.1.30 కోట్లతో శంకుస్థాపన చేసి పర్యాటక అతిథిగృహంలో ధ్యానమందిరం, సమావేశ మందిరంతో పాటు పార్కు, మరుగుదొడ్ల నిర్మాణాలు జరిగాయి.

అతిథిగృహంలో ప్రత్యేకంగా బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. క్రీ.పూ. 3 నుంచి 11వ శతాబ్దాల మధ్య నందలూరు బాహుదానది ఒడ్డున బౌద్ధారామాలు విరాజిల్లాయని దక్షిణ భారతదేశ పర్యటన చేసిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ప్రపంచానికి తెలియజేశారు. 1977లో అప్పట్లో రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరపగా 1979లో ముక్తికనుమపై 21 స్థూపాలు బయటపడ్డాయి.

ఆడపూరులోని బౌద్ధారామాలు



అయితే అప్పట్లో ప్రభుత్వాలు సరైన ప్రచారాలు నిర్వహించకపోవడంతో బౌద్ధారామాల స్థూపాలకు తగినంత ఆదరణ లభించలేదు. గత ప్రభుత్వాలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేసినా నిర్మాణాలలో అలసత్వం, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించలేదు. ఇప్పటికైనా పర్యాటకశాఖ వారు అతిథిగృహాన్ని ప్రారంభించి మరిన్ని నిధులతో ప్రచారం చేస్తే సమీపంలోని సౌమ్యనాథ ఆలయం ఉండడంతో తప్పనిసరిగా భక్తులు, పర్యాటకులు బౌద్ధారామాల సందర్శనకు వస్తారని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు వీలవుతుందని స్థానికులు అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో అరుదుగా ఉన్న ఈ బౌద్ధారామాలను మరింత అభివృద్ధి పరచాల్సిన బాధ్యత పర్యాటకశాఖపై ఉంది.


ముక్తికనుమ వద్ద నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం

చర్యలు తీసుకోవాలి



భారతదేశంలో గౌతమి బుద్ధుడి స్థూపాలు రెండు రకాలు. బుద్ధుడు మహా నిర్యాణం పొందిన తర్వాత ఆయన అవశేషాలపై నిర్మించినవి శారీరక స్థూపాలు కాగా ప్రత్యేక సందర్భాల్లో నిర్మించినవి ఉద్ధేశిక స్థూపాలు. గుంటూరు జిల్లా అమరావతి, కృష్ణాజిల్లా ఘంటసాలలో శారీరక స్థూపాలు నిర్మించగా కడప జిల్లా నందలూరు వద్ద ఉన్న ఆడపూరు గుట్టలో ఉద్ధేశిక స్థూపాలను తీర్చిదిద్దారు. ఇప్పటికైనా నందలూరు మండలంలోని చారిత్రక బౌద్ధారామాలను అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలో పర్యాటకరంగం వేగం అందుకుంటుంది.

- డాక్టర్ అరిగె రాంప్రసాద్, నందలూరు.

పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలి



మండలంలోని ఆడపూరు ముక్తికనుమల్లోని బౌద్ధారామాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దాలి. అక్కడ కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించిన అతిథిగృహాన్ని, పార్కును అందుబాటులోకి తేవాలి. చారిత్రాత్మక, ప్రాచీన బౌద్ధారామాలను అభివృద్ధిపరిచి వెలుగులోకి తేవాలి.

-జంబు సూర్యనారాయణ, సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

టెక్నాలజీ సాయం

ఇల్లు 6 అడుగులు పైకి...



కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేడు ఆధునిక టెక్నాలజీ అన్ని రంగాల్లో ఉపయో గపడుతోంది. రోడ్డు విస్తరణలో భాగంగా ఓ ఇల్లు రోడ్డు కంటే ఆరు అడుగులు తగ్గులోకి వెళ్లింది. దీంతో ఆ ఇంటిని పడగొట్టకుండా నూతన టెక్నాలజీ సాయంతో అధునిక పరికరా లను ఉపయోగించి పైకి లేపుతున్నారు. వివరాల్లోకి వెళితే...

కొండాపురం పట్టణంలో ప్రస్తుతం నాలుగులైన్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కనే ఉన్న సుధీర్‌శ్రేష్ఠి ఇల్లు రహదారి కంటే తగ్గులోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఇదే నివాసంలో అతనికి కిరాణాషాపు ఉండగా తగ్గులో ఉంటే వ్యాపారం జరగదని భావించి.. ఇంటిని పడగొట్టకుండా పైకి లేపాలని నిర్ణయించు కున్నాడు. ఈ పనులను చెన్నైకు చెందిన ఓ సంస్థకు అప్పగించాడు. దీంతో వారు బేస్‌మెంట్ పైభాగం నుంచి ఇంటిని యథాతథంగా పైకి లేపుతున్నారు. బేస్‌మెంట్‌కు, ఇంటికి మధ్యలో పెద్ద పెద్ద జాకీలు ఉంచి, నూతన టెక్నాలజీ, అధునిక పరికరాల సహాయంతో సుమారు 6 అడుగులు పైకి లేపుతున్నట్లు ఇంటి యజమాని తెలిపారు. ఇళ్ల చెక్కు చెదరకుండా ఇంటిని పైకి ఎత్తుతున్నారు. ఈ ప్రక్రియలో కింద పరిచిన బండలు మాత్రమే పక్కకు తీస్తారని తెలిపారు. కాగా సుమారు 6 అడుగుల ఇళ్ల పైకి లేపడానికి సుమారు రూ.15 లక్షల వరకు వ్యయం అవుతోందని తెలిపాడు. కాగా, ఇంటిని యథాతదంగా పైకి లేపడాన్ని జనాలు ఆసక్తిగా చూస్తున్నారు.

బకాయిలుంటే కనెక్షన్ తొలగించండి

● మొండి బకాయిలకు రెడ్-కోర్టు నోటీసులు ● విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రమణ



విద్యుత్‌శాఖ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌ఈ రమణ

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ బకాయిలుంటే వెంటనే కనెక్షన్ కట్ చేయాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రమణ కింది స్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మొండి బకాయి లున్న వారికి రెడ్ నోటీసులు ఇవ్వాలన్నారు. గురువారం కమలా పురం, ఎర్రగుంట్ల నగరపంచాయతీ, రూరల్ ఏరియాల్లో విద్యుత్ బకాయిల వసూళ్లపై ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. బకాయిలు ఎక్కువగా ఉండడంతో సిబ్బందిపై మండిపడ్డారు. పెద్ద మొత్తంలో బకాయిలుండడం సిబ్బంది పనితీరుకు అద్దం పడుతోందని, ఇకపై ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించారు. బకాయిల వసూళ్లలో రాజీ వద్దని, దయ చూపించే స్థితిలో సంస్థ లేదన్నారు. విద్యుత్ సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తోందన్నారు. మరొక నెల తర్వాత బిల్లు వసూ లు చేస్తోందన్నారు. వెరసి వినియోగదారులకు రెండు నెలల గడువునిస్తోందన్నారు. నిబంధనల ప్రకారం వారి మీటరు శాశ్వతంగా తొలగించి కోర్టులో దావా వేసి చట్టరీత్యా చర్యలు తీసుకుని విద్యుత్తు బకాయిలు వసూళ్లు చేయాలని సూచించారు. నెలవారి విద్యుత్ బకాయిల వసూళ్ల లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల డిపూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు

● మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెప్మా పీడీ వై.సురేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఆంధ్ర జ్యోతిలో అనాధలు, అభాగ్యులకు ఆసరా ఏది అనే శీర్షికపై ఆయన స్పందిస్తూ కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వం నాలుగు బ్యాక్‌వర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంటు సొసైటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే మూడింటికి కాలపరిమితి పూర్తవడంతో వాటిలో ఉన్న నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం జడ్పీ కార్యాలయ ఆవరణలో శ్రీవిజయసేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరాశ్రయుల వసతి గృహంలో 50 పడకలతో వసతి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మరొక వసతి ఏర్పాటు చేసేందుకు విద్య చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ముందుకు వచ్చిందని.. దానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో నిరాశ్రయులకు వసతి కల్పించేందకు అన్ని చర్యలు చేపడతామని చెప్పారు.

తుఫాన్ ప్రభావం

నల్లబడ్డ వరిగింజలు

ఆందోళనలో రైతులు.. ఆదుకోవాలని వేడుకోలు



చెన్నూరు, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షం రైతులను నట్టేట ముంచింది. వర్షానికి వరి ధాన్యంలో దాదాపు పాతిక భాగం నల్లగింజగా మారాయి. దీంతో పెట్టిన ఖర్చులైనా వస్తాయా రావో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. చెన్నూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో చిన్నమాచుపల్లె, ఉప్పరపల్లె, రామనపల్లె గ్రామాలలో దాదాపు 800 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇప్పటికే పలు రెవెన్యూ గ్రామాల్లో కోత దశపూర్తి కాగా ఈ మూడు రెవెన్యూ గ్రామాల్లో గురువారం నుంచి వరి కోతలు మొదలయ్యాయి. కోసిన వరి ధాన్యం తెచ్చి రైతులు కలాల్లో ఆరబోస్తున్నారు. అయితే పండిన వరి ధాన్యంలో ఎక్కువ నల్లగింజలు కనిపిస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నల్లబడ్డ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదని వాపోతున్నారు. ఈ విషయం వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు కోసిన ధాన్యం పరిశీలించి.. విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని.. ప్రభుత్వానికి కూడా నివేదికలు పంపి తగిన న్యాయం చేస్తామని చెబుతున్నారు. మరి నష్టపోయిన రైతులకు ఏ మాత్రం న్యాయం జరుగుతుందో చూడాలి.

జాతీయ పోటీలకు మాసాపేట విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలోని వజ్రకరూరులో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కడప జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించి అరాఫత్ (10వ తరగతి) జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అంతేగాక ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో కడప జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి జిల్లా జట్టు నుంచి వెంకటేశ్, బి.భవంత్‌సాగర్ (9వ తరగతి)లు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని మంగళం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 బేస్‌బాల్ విభాగంలో కడప జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించగా అందులో ఎం.సంతోష్ (9వ తరగతి), బి.సంతోష్ (8వ తరగతి) ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగిన అండర్-17 బేస్‌బాల్ విభాగంలో డి.శివరాం (10వ తరగతి) జాతీ యస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ సుగవాసి ఆనందబాబు, 1వ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌ప్రసాద్‌లు జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు ఉత్తన్న విద్యార్థుల క్రీడా పరికరాల కోసం రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు.

లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి

కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే



మాట్లాడుతున్న కాత్యాయని విద్మహే

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన రచయిత కేతు విశ్వనాథరెడ్డి అని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రసిద్ధ తెలుగు రచయిత్రి ప్రొఫెసరు కాత్యాయని విద్మహే అన్నారు. వైవీయూ ఆర్ట్స్ బిల్డింగులో ప్రసిద్ధ తెలుగు రచయిత కేతు విశ్వనాథరెడ్డి జీవితం, రచనలపై నా దృష్టిలో పేరుతో సాహిత్య కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తమాన సామాజిక దుర్మార్గాలను సాంస్కృతిక కోణం నుంచి ఎదుర్కొన్న రచయిత కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. కులమత అసంబద్ధాలు, అపోహలు తొలగిపోవాలంటే ఆయన కథలు చదవాలన్నారు. వర్తమాన సమాజానికి అవసరమైన లౌకిక ప్రజాస్వామ్య భావనలు కలిగిన వ్యక్తి అన్నారు. విశ్వనాథరెడ్డి తోటి విద్యార్థులతో స్నేహితంగా మెలుగుతూ జ్ఞాన చైతన్యం చేసేవారన్నారు. రిజిస్ట్రారు పద్మ మాట్లాడుతూ అభ్యుదయ రచయితగా రైతులు, పేదలు పీడితుల పక్షాన నిలిచిన గొప్ప రచయిత కేతు విశ్వనాథరెడ్డి అని తెలిపారు. వైవీయూ తెలుగుశాఖ ప్రొఫెసరు ఎంఎం వినోదిని, ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసరు గంగయ్య, తెలుగుశాఖ ప్రొఫెసరు రమాదేవి, విద్య సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి, క్రిష్ణకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వల్లూరు వంశీనాథరెడ్డి జన్మదినం సందర్భంగా కడప నగరంలోని రాజీవ్‌పార్కు వద్ద ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అభిమానులు, మిత్ర బృందం

పోటాపోటీగా సాగిన ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ పోటీలు

ఈస్ట్ గోదావరి, రెస్ట్ ఆఫ్ సెంట్రల్, రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల విజయం



సాయిశ్రావణ్ (151 నాటౌట్), రేవంత్‌రెడ్డి, (131)

కడప స్పోర్ట్స్ నవంబర్ 28, (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 మెన్స్ ఇంటర్ జోనల్ ఒన్‌డే క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. గురువారం వేర్వేరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లలో ఈస్ట్ గోదావరి జట్టు ప్రకాశం జట్టుపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అనంతపురం జట్టుపై రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపొందింది. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టుపై 4వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. వివరాలిలా..

కేఓఆర్ఎం మైదానంలో ఈస్ట్ గోదావరి-ప్రకాశం జట్ల మధ్యసాగిన మ్యాచ్‌లో తొలుత టాస్‌నెగ్గిన ప్రకాశం జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 46.2 ఓవర్లలో 286 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో అభినవ్ 92 పరుగులు, రోహిత్ 77 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు విజయానికి అవసరమైన 287 పరుగులను 47.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి సాధించింది. ఇందులో సాయిశ్రావణ్ పరుగుల మోత (151 నాటౌట్) మోగించాడు. దీంతో ఈస్ట్ గోదావరి జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపుసాదించింది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్-అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి నిర్ణీత 50 ఓవర్లలో 203 పరుగులు చేసింది. ఇందులో కేఎస్ఎన్ రాజు 56 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 37.2 ఓవర్లలో 176 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 26 పరుగుల తేడాతో గెలుపు సాధించింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్- రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్‌నార్త్ జోన్ జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 294 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఇందులో హర్షవర్ధన్ 63 పరుగులు, సాయిపూర్ణతేజ 55 పరుగులు చేశారు. రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 45.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసి విజయబావుటా ఎగురవేసింది. ఇందులో రేవంత్‌రెడ్డి 131 పరుగులు చేయడం విశేషం.

రైస్‌పుల్లింగ్ వ్యాపారం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైస్ పుల్లింగ్ వ్యాపారం పేరుతో మోసం చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. మూలే వెంకటరమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగుళూరుకు చెందిన అగలి అపర్ణ, ఆమె భర్త జయశీలన్, అపర్ణ అక్క అరుణకుమారి, స్నేహితుడు రామాంజనేయులు, అపర్ణ కజిన్ సిస్టర్ శోభారాణి , ఆమె కొడుకు విష్ణుకుమార్ రాజులపై కేసు నమోదు చేశామన్నారు. కాగా, అరెస్టు అయిన వారిలో అపర్ణ, అరుణకుమారి, రామాంజనేయులు ఉన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు...

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ రోడ్డులోని రైల్వేబ్రిడ్జి కింద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కదిరి టౌన్‌కు చెందిన పూల సునీల్‌కుమార్, మహ్మద్‌నయాజ్, బిజినేవాలా చాంద్ బాషాలు గురువారం ఉదయం గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి ముగ్గురిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి కేజీ 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండుకు తరలించామన్నారు.

'ఆగిపోయిన ఆలయాల పనులు పూర్తి చేయిస్తాం'

పులివెందుల టౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా పరిధిలో ఆగిపోయిన ఆలయాల నిర్మాణ పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎండోమెంట్ అసిస్టెంటు కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్ తెలిపారు. పులివెందులలో గురువారం ఆయన అంకాలమ్మ తల్లి ,పడమటి వీరాంజనేయ, శ్రీమిట్టమల్లేశ్వర స్వామి ఆలయాల హుండీల లెక్కింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధి పనులు ఆగిపోయాయని.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. పులివెందుల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వెంకటరమణ, ఇన్స్‌పెక్టరు కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పొలతలలో హుండీల ఆదాయం రూ.15 లక్షలు



స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పెండ్లిమర్రి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పొలతల క్షేత్రంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ తెలిపారు. మల్లేశ్వరస్వామి దేవస్థానంతో పాటు అనుబంధ దేవస్థానమైన పుట్ట ఆంజనేయస్వామి దేవస్థానాల హుండీలను దేవదాయ ధర్మాదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ ఆధ్వర్యంలో లెక్కించారు. మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.14,90,437, పుట్ట ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.34,190 మొత్తం రూ.15,24, 627 ఆదాయం వచ్చిందన్నారు. వీటితో పాటు సుమారు 60గ్రాముల బంగారు, 2.50కేజీల వెండి భక్తులు సమర్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరిగిరెడ్డి రాజారెడ్డి, ఆలయ పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ ఫరూక్



నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ (రిమ్స్) ఏపీ ఎన్నికలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. అధ్యక్షుడిగా రిమ్స్ డాక్టర్ ఫరూక్, కార్యదర్శి ఎస్పీఎం అసోసియేట్ ప్రొఫెసరు డాక్టర్ సుబ్బరాయుడు, కోశాధికారిగా జనరల్ సర్జరీ, అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ శ్రీధర్‌రెడ్డిలతో కూడిన కార్యదర్శవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికలకు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నూకరాజు ఎన్నికల అధికారిగా ఉన్నారు.

నేటి నుంచి వైవీయూ డిగ్రీపరీక్షలు

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 29వ తేదీ నుంచి సెమిస్టరు పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ క్రిష్ణారావు వెల్లడించారు. జిల్లాలోని 54 కేంద్రాల్లో 1,3, 5 సెమిస్టర్లకు సంబంధించి 20,819 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు.

మొదటి సెమిస్టరు 8,407 మంది, మూడో సెమిస్టరు 6903 మంది, ఐదో సెమిస్టరు 5509 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిచేందుకు వైవీయూ ఉన్నతాధికారుల మార్గదర్శకంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు.

అమ్మవారికి రూ.8 లక్షలతో వెండి కవచం

రైల్వేకోడూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజవీధిలో వెలసి ఉన్న అంకాలమ్మ అమ్మవారికి రూ.8 లక్షల విలువైన 8 కిలోల వెండి కవచాన్ని తోట శివసాయి కుటుంబ సభ్యులు గురువారం వితరణ చేశారు. తమిళనాడులో బంగారు వ్యాపారి తోట యుగంధర్ తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఉద్యమంలా మొక్కల పెంపకం

● లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆంజనేయులు

రాయచోటిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌తో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఉద్యమంలా మొక్కల పెంపకం చేపడుతున్నామని ఆర్‌బీఐ ప్రతినిధి నవీన్‌చిరినెల్లి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అంజనేయులు తెలిపారు. గురువారం రాయచోటి పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజర్వు బ్యాంకు, జిల్లా లీడ్‌బ్యాంక్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ బాషా, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు.

బస్టాండ్‌లేక ప్రయాణికుల ఇక్కట్లు

● పెద్దమండ్యంలో ఆగిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం ● బస్సుల కోసం రోడ్లపైనా, దుకాణాల వద్ద గంటల తరబడి అవస్థలు పడుతున్న జనం

పెద్దమండ్యం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పెద్దమండ్యంలో ఆర్టీసీ బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆర్టీసీ బస్సుల కోసం జనం రోడ్లపైన, దుకాణాల వద్ద గంటలతరబడి వేచిచూస్తూ కాలంగడపాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కాగా ఆర్టీసీకి ఆదాయం ఉన్న మార్గాలలో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా మదనపల్లి- తిరుపతి మార్గంలో మదనపల్లి ఆర్టీసీకి వస్తున్న కలెక్షన్‌ల తరవాత మదనపల్లి -గాలివీడు మార్గంలో ఆదాయం వస్తున్నాయి. ఈ మార్గంలో పలు చోట్ల ఆర్టీసీ బస్టాండ్‌లు లేక నిలుచొన్న చోటే బస్టాండ్ అని చెప్పుకోవాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన పెద్దమండ్యంకు మదనపల్లి - గాలివీడు వయా అంగళ్లు, గుర్రంకొండ, కలిచెర్ల, పెద్దమండ్యం మీదుగా గాలివీడుకు చేరుతుంది. కాగా పెద్దమండ్యం నుంచి మదనపల్లి, తంబళ్లపల్లి, రాయచోటి, తిరుపతి, గాలివీడు వివిద ప్రాంతాల్లో బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు పెద్ద మండ్యం బస్టాప్‌లో బస్సుల కోసం గంటల తరబడి వేచి వుండాల్సిందే. ఆ ప్రాంతంలో ఉన్న దుకాణాల్లో వారి అనుమతితో కొద్ది సేపు ప్రయాణికులు కూర్చునే అవకాశం ఉంది. అత్యవసర సమాయాల్లో ప్రయాణికులు బస్టాండ్‌లేని కారణంగా బాత్‌రూంలు లేక మహిళలు, వృద్ధులు పిల్లలు, నానా అవస్థలు పడుతున్నారు. వర్షకాలం, వేసవి ఎండలకు దశాబ్దాలుగా పెద్దమండ్యం ప్రయాణికులు కష్టాలు పడుతూనే ఉన్నారు. ప్రజాప్రతి నిధులకు, ఆర్టీసీ అధికారులకు ఇక్కడ సౌకర్యాలు కల్పించాలని విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గంలో ప్రయాణీల ద్వారా ఆర్టీసీకి కోట్ల రూపాయల ఆదాయం వస్తోందని కానీ ప్రయాణీలకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పలువురు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం పెద్దమండ్యం బస్టాండ్ నిర్మాణం కోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 15 లక్షలు, మండలంలోని కలిచెర్ల బస్టాండ్ నిర్మాణం కోసం రూ. 15 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. పెద్దమండ్యం బస్టాప్ పక్కనే సంవత్సర క్రితం చేపట్టిన బస్టాండ్ నిర్మాణం పూర్తి చేయడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. అలాగే కలిచెర్లలో బస్టాండ్ నిర్మాణ పనులు చేపట్టలేదు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని పెద్దమండ్యం బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి ప్రయాణీలు కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఆర్టీసీ బస్సు రాగానే ఎక్కడానికి ప్రయాణికుల పాట్లు


పెద్దమండ్యంలో ఆగిన బస్టాండ్ నిర్మాణం

నిధులు లేక పనులు ఆగాయి

పెద్దమండ్యం బస్టాండ్ అభివృద్ధి పనులు నిధులు లేక ముందుకుసాగలేదు. కలిచెర్లలో బస్టాండ్ నిర్మాణానికి నిధులున్న స్థలం ఎంపిక చేయడంలో జాప్యం జరిగింది. నిధులు మంజూరైన వెంటనే పెద్దమండ్యం బస్టాండ్ నిర్మాణ అభివృద్ధి పనులు చేపడతాం.

-షేక్ షానవాజ్, ఇన్‌చార్జ్ పీఆర్ ఏఈ, పెద్దమండ్యం మండలం

పూలే ఆశయాలకు అనుగుణంగా పనిచేద్దాం

మదనపల్లె/ టౌన్/ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద జలవనరులశాఖ ఏఈ రాయలబాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జ్యోతిరావు పూలేను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జలవనరులశాఖ ఈఈ సురేష్‌బాబు, క్వాలిటి కంట్రోల్ డీఈ గోపాల్, టీడీపీ నాయకులు యర్రబల్లివెంకటరమణారెడ్డి, కమలమర్రి కృష్ణ, నీలకంఠ, రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు. తట్టివారిపల్లె గ్రామసచివాలయంలో సర్పంచ్ దీపా, మాజీ సర్పంచ్ వేమారెడ్డి ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. పూలే 134వ వర్ధంతిని పురష్కరించుకుని స్థానిక బాస్ కార్యాలయంలో బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ పూలే జీవితంపై ప్రజల్లో అవగాహన పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్ర మంలో బాస్ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టి రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, బురుజు రెడ్డిప్ర సాద్, శ్రీకాంత్, గంగాధర్, రవిశంకర్, కృష్ణ, హైదర్, బీసీ నాయకుడు శివకుమార్, చైతన్య అనాధ ఆశ్రమం చైర్మన్ ఆనంద్ పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో బహుజన యువసేన(బీవైఎస్) అధ్యక్షుడు పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి వేడుకలు నిర్వహించారు. హరీష్, ఆది, శ్రీనివాసులు, శశికుమా ర, బాబాసాహెబ్, దేవేష్, బాలకృష్ణ, వేణు, సాధిక్, బాలు, భానుప్రకాష్, మధు, శంకర్ పాల్గొన్నారు.


జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్

అవినీతి నిరోధానికి న్యాయ కోవిదుల ఫోరం

●మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి వెల్లడి



మదనపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతి నిరోధానికి న్యాయకోవిదుల ఫోరం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనులకోసం వెళ్లే వివిధ వర్గాల ప్రజలకు అధికారులు, సిబ్బంది నుంచి లంచావతారం ఎదురవుతోందన్నారు. పనుల కోసం డబ్బులు ఇచ్చుకోలేక, ఎవరికీ చెప్పుకోలేక పేద ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తాను మొదటి నుంచీ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అవినీతి, అక్రమాల పోరులో భాగంగా న్యాయకోవిదులతో కలసి సంబంధిత వేదికల ద్వారా పార్టీలు, వర్గాలకు అతీతంగా సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. న్యాయకోవిదుల ఫోరం బాధితులకే కాదు..ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుందని వివరించారు. రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ నాయకులకే ఇలాంటి సమస్య ఎదురైతే, ఇక సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. మదనపల్లె తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్ స్పందించి తహసీల్దార్‌తో పాటు వీఆర్వోలను విచారించి చర్యలకు ఉపక్రమించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబును కలిసిన జడ్జి రామకృష్ణ

బి.కొత్తకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును బి.కొత్తకోటకు చెందిన జడ్జి సంకు రామకృష్ణ గురువారం కలిశారు. చంద్రగిరిలో సీయం సోదరుడు నారా రామ్మూర్తినాయుడు వైకుంఠసమారాధన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా అక్కడికి హాజరైన జడ్జి రామకృష్ణ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లతో కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ అప్యాయంగా పలకరించి, పలువిషయాలను క్లుప్తంగా చర్చించినట్లు తెలిసింది.


సీయం చంద్రబాబునాయుడును కలిసి మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణ

టీడీపీ సభ్యత్వ నమోదులో వేగం పెంచాలి

మదనపల్లె టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదులో వేగం పెంచాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీసీ విభాగం టీడీపీ అధ్యక్షుడు ఎం.నాగయ్య లైఫ్‌టైమ్ సభ్యత్వ నమోదు చేసి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెసులుబాటు ఉన్న వారు లైఫ్‌టైమ్ మెంబర్‌షిప్‌లు కట్టాలన్నారు. దీంతో పాటు ప్రతి వార్డు, గ్రామంలో టీడీపీ నాయకులు టీడీపీ సభ్యత్వ నమోదుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ఇన్సూరెన్స్, ఇతర ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నాయుడు, లక్ష్మీపతి, గంగాధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


లైఫ్‌టైమ్ సభ్యత్వం కోసం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యేకు అందిస్తున్న టీడీపీ నేత నాగయ్య

అనుచరుడికి నల్లారి సోదరుల పరామర్శ


స్వరూప్ కుమార్ ఇంటిలో నల్లారి సోదరులు

పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాతృవియోగానికి గురైన తమ అనుచరుడిని నల్లారి సోదరులు గురువారం పరామర్శించారు. పీలేరు పట్టణం రెడ్డి అండ్ రెడ్డి కాలనీకి చెందిన నల్లారి అభిమాని, అనుచరుడు స్వరూప్ కుమార్ రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందారు. అప్పట్లో వీలుకాకపోవడంతో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గురువారం సాయంత్రం స్వరూప్ కుమార్ రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిల్లా రెడ్డిశేఖర్ మృతి తీరనిలోటు

కలకడ, నవంబరు28(ఆంధ్రజ్యోతి):గిరిజన హక్కుల ఉద్యమనాయకుడు, సామాజిక కార్యకర్త, విద్యావేత్త కిల్లా రెడ్డిశేఖర్ మృతి తీరని లోటని వివిధ సంఘాల నాయకులు సానుభూతి వ్యక్తం చేశారు. మండలంలోని గుడిబండ పంచాయతీ తెట్టు గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించి సంతాపాన్ని తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్వగ్రామంలో జరిగిన ఆయన అంతిమ యాత్రలో నాయకులు పులి శ్రీనివాసులు, గంగిరెడ్డి, కోనేటి దివాకర్, పాలకుంట శ్రీనివాసులు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాటిల్ షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కురబలకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్యాటిల్ షెడ్ల నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలని ఏపీడీ మధుబాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చింతమాకులపల్లెలో క్యాటిల్ షెడ్ల నిర్మాణపనులను ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మంజూరైన షెడ్లను డిసెంబరు 15లోగా నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేష్ పాల్గొన్నారు.


క్యాటిల్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఏపీడీ

నేడు బి.కొత్తకోటలో లక్ష దీపోత్సవం

బి.కొత్తకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో శుక్రవారం కార్తీక మాస లక్షదీపోత్సవం కనులపండువగా నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన శ్రీమహావిష్ణుసేన ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలనుంచి దీపోత్సవ కార్యక్రమం తిరుపతి శ్రీనివాసమంగాపురంకు చెందిన శ్రీలలితపీఠ వ్యవస్థాపక పీఠాధిపతి స్వరూపానందగిరి స్వామి వారిచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి సేవలో తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలి

● మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

కలికిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్దేశించిన మెనూ ప్రకారమే తప్పనిసరిగా పిల్లలకు ఆహారం అందజేయాలని మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ స్పష్టం చేశారు. గురువారం ఆయన కలికిరి-1, కలికిరి-4 అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పిల్లల హాజరును పరిశీలించారు. అనంతరం చిన్న పిల్లలకు అందజేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి ఆహార పదార్థాలను వండుతున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించి మెనూ ప్రకారం ఆహారం ఎందుకు తయారు చేయలేదని కార్యకర్తలను ప్రశ్నించారు. కార్యకర్తల సమాధానాలతో సబ్‌కలెక్టర్ సంతృప్తి చెందలేదు. ఎక్కడో పొరబాటు జరుగుతోందని మెనూ జాబితాలను పరిశీలించారు. గురువారం అన్నం, ఆకుకూర పప్పు, కూరగాయలతో సాంబారు, ఉడికించిన కోడి గుడ్డు (ఉదయం అల్పాహారంగా) ఇవ్వాల్సి ఉంది. అయితే అన్నంలోకి సాంబారు మాత్రమే అందించడం పట్ల సబ్ కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు. వాల్మీకిపురం సీడీపీవో భారతి మెనూ జాబితాను సబ్‌కలెక్టరుకు చూపించారు. ఈ మెనూ గర్భిణులతో కలిపి చిన్న పిల్లలకు కూడా అందజేస్తున్నదని వివరించారు. ప్రస్తుతం గర్భిణులకు వండిన ఆహారం అందజేయడం లేదని, సరుకులన్నీ వారి ఇంటి వద్దకే చేరుస్తున్నట్లు చెప్పారు. చిన్నపిల్లలకు మాత్రం వండాల్సిన ఆహార పదార్థాలకు సంబంధించిన మెనూ ఇంత వరకూ రాలేదని, ఈ కారణంగా పాత మెనూలోని ఒక కూరను మాత్రమే అందజేస్తున్నట్లు విశదీకరించారు. కొత్త మెనూను వెంటనే తెప్పించుకుని ఆ మేరకు ఆహార పదార్థాలు అందజేయాలని ఆయన ఆదేశించారు. అక్కడే వున్న భవిత కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్వరీ బాయి, వాల్మీకిపురం సీడీపీవో భారతి, సూపర్‌వైజర్ అరుంధతి, కార్యకర్తలు సూర్యకళ, బేగం పాల్గొన్నారు. సమావేశానికి తహసీల్దారు, డీటీ నవీన్, సర్వేయర్లు, వీఆర్వోలు హాజరయ్యారు.


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

అపార్ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు..

వాల్మీకిపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అపార్ గుర్తింపు ఇచ్చే దిశగా ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని నిర్వహించారు. అయితే రెండు రోజుల పాటుగా వందలకొద్దీ విద్యార్థులు కేంద్రానికి చేరుకున్నా కనీస పదుల సంఖ్యలో విద్యార్థుల అపార్ సమస్యను పరిష్కారం కాలేదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గురువారం ఉదయం నుంచి పిల్లలతో తల్లిదండ్రులు ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరగా సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడం కనీసం పది మంది విద్యార్థులకైనా ఆధార్ సమస్యలను పరిష్కరించలేకపోయారు. దీనికి తోడు విద్యుత్ అంతరాయంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. కేవలం రెండు రోజుల పాటు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సరికాదంటున్నారు. అపార్ పరిష్కారం కాని పిల్లల తల్లిదండ్రులు ఆధార్ కోసం మళ్లీ తామెక్కడికి వెళ్లాలంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని ఇదే పాఠశాలలో మరో రెండు, మూడు రోజుల పాటు ఆధార్ కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతున్నారు.


వాల్మీకిపురంలో ఆధార్ అప్‌డేట్ కొరకు పిల్లలతో కలిసి ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

ఆటో బోల్తా .. ముగ్గురికి గాయాలు

పెద్దతిప్పసముద్రం నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రమాదవ శాత్తు ఆటో బోల్తా పడిన ఘటన లో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలైన సంఘటన పీటీఎం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పీటీఎంకు చెందిన ఓ షేర్ ఆటోలో పది మంది మహిళలతో కూలీ పనుల నిమిత్తం పోతుపేట పంచాయతీ ఎగువపల్లె వద్దకు వెళుతుండగా ఆవు దూడ ప్రమాదవ శాత్తు ఆటో కిందకు దూరడంతో ఆటో బోల్తా కొట్టింది దీంతో ఆటోలో వెళుతున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయని గాయపడిన మహిళలను మదనపల్లెలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. వారికి ఎటువంటి ప్రమాదం లేదని స్వల్ప గాయాలే కావడంతో పెను ప్రమాదం తప్పిందని అందరు ఊపిరి పీల్చుకున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ములకలచెరువు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం ఓ ద్విచక్రవాహనం చోరీకి గురైంది. కర్ణాటక రాష్ట్రం చేలూరుకు చెందిన పకీర్‌సాబ్ సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని రైల్వేస్టేషన్ ఆవరణలో ఉంచి బస్టాండుకు వచ్చాడు. పని ముగించుకుని తిరిగి రైల్వేస్టేసన్‌కు ఆవరణలోకి వెళ్ళగా ద్విచక్రవాహనం కన్పించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పడిపూజకు ఎమ్మెల్యేకి ఆహ్వానం

మదనపల్లె అర్బన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పిలి గ్రామంలో డిసెంబరు4వ తేదీన అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించే స్వామివారి పడిపూజలకు గురువారం ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషాను ఆహ్వానించారు. అనంతరం ఆయన పడిపూజ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు మాట్లాడుతూ పడిపూజను అత్యంతవైభవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఆలయంలో అయ్యప్ప మాలదారులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. దాతలు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం


ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కురబలకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో 35 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి ఇందులో ప్రతిభ కనబరిచిన 29మందికి సీ సర్టిఫికెట్లను ఏవో లోకనాథమ్, కమాండింగ్ లెఫ్టినెంట్ మోనిష్, ప్రిన్సిపాల్ యువరాజ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రివిధ దళాలలో ఉద్యోగవకాశాలకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలన్నారు. కాగా విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి.ఎన్, కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్‌కుమార్ తదితరులు అభినందించారు.

వాల్మీకిపురంలో: చదువుతో పాటుగా ఎన్‌సీసీ లో వలంటీర్లుగా చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రా బెటాలియన్ 35వ కమాండింగ్ అధికారి ఎన్‌వీ మోనిస్ పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలోని ఎన్‌సీసీ యూనిట్ విభా గాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వలంటీర్లతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్ర మంలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, ఐక్య త వంటి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అధికారి లోకనాథన్, ఎన్‌సీసీ అధికారులు మహేష్‌రాయ్, నందరామ్, పాఠశాల కేర్‌టేక్ అధికారి రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజు, రమణప్ప, నాగేశ్వర, శ్రీనివాసు లురెడ్డి, ఎన్‌సీసీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ విద్యార్థులతో ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి ఎన్‌వీ మోనిస్

నిమ్మనపల్లిలో: ఎన్‌సీసీ విద్యార్థులు దేశ భక్తితో పాటు క్రమశిక్షణ కలిగి ఉండాలని (35ఏబిఎన్) ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ మోనిష్, మేజర్ లోకనాథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థుల శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల కృషితోనే ఉన్నత స్థానాలకు వెళతారని తెలిపారు. ముఖ్యంగా ఎన్‌సీసీలో శిక్షణ చేస్తున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి దేశభక్తితో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీటీవో వెంకటగోపాల్, ఉపాధ్యాయులు సహదేవరెడ్డి, వాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

కురబలకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో ప్రతి ఇంటి వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని డీపీవో బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో అంగళ్ళు పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తసంపద కేంద్రాల నుంచి ఎరువులను తయారు చేసి సంపద సృష్టించాలన్నారు. కాగా వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.విశ్వనాథరెడ్డి, ఎంపిడీవో గంగయ్య, పంచాయతీ కార్యదర్శులు శేషగిరి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పింఛన్ల పండుగ

●30న ఇళ్ల వద్దనే పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈ నెల 30వ తేదీనే(శనివారం) లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి పేర్కొన్నారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే 30వ తేదీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో 30న పింఛను అందుకోలేక పోయిన వారికి.. సోమవారం పంపిణీ చేస్తామన్నారు. తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర అన్ని రకాల పింఛన్లు కలిపి 6,179 ఉన్నాయని, వారికి డిసెంబరు నెలకు సంబంధించి రూ.2.67 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 6 నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పింఛను సొమ్మును అందచేస్తారని..పింఛనుదారులందరూ ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి పింఛను సొమ్మును అందుకోవాలని కోరారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక పింఛన్లను ప్రతి నెల 1వ తేదీనే పంపిణీ చేస్తున్నారు. ఒక వేళ 1వ తేదీ సెలవు దినం అయితే ముందు రోజే పెన్షన్లను పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

హంద్రీ-నీవా కాలువ ఆక్రమణదారులపై చర్యలేవి?

కురబలకోట, నవంబరు 28 (ఆం ధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువకు సంబంధించి భూమిని ఆక్రమిం చుకుని ప్లాట్లు వేసి విక్రయాలు చేపట్టిన రియల్ వ్యాపారులపై చట్టపరంగా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని జిల్లా వ్యవ సాయ కార్మిక సంఘ ప్రధాన కార్య దర్శి కృష్ణప్ప, మరో నేత సాంబశివ లు ప్రశ్నించారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సర్వే నంబర్ 220లో హంద్రీ-నీవా కాలువ భూమిని దర్జాగా రియల్టర్‌లు ఆక్రమించుకుని వ్యాపారం చేస్తుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కేవలం రెవెన్యూ లోపాయికారి ఒప్పందంతోనే రియల్‌వ్యాపారులు విక్రయాలు చేప ట్టారని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేడుతామన్నారు. అలాగే అమ్మచెరువు మిట్ట వద్ద అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

బాల్యవివాహాల నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలి

నిమ్మనపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహల నిర్మూలనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏవో రమేష్ పేర్కొన్నారు. గురువారం మహిళా సమాఖ్య సభ్యులతో కలసి బాల్యవివాహలపై స్థానిక బస్టాండులో ర్యాలీ, మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఎం మురళి మాట్లాడుతూ గ్రామీణ ప్రాతాలలో ఎక్కువగా బాల్య వివాహాలు చేసున్నారని దీని వలన వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. అలాగే విద్య ఆరోగ్యం దెబ్బతింటాయన్నారు. 18ఏళ్ల నిండిన తరువాతే వివాహాలు చేయాలని తెలిపారు. అలాగే గృహహింస నిర్మూలించాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


బాల్య వివాహాల నిర్మూలనపై మానవహారం చేస్తున్న అధికారులు

మదనపల్లె టౌన్‌లో: బాల్యవివాహాలను అరికట్టడంలో అందరు కలసికట్టుగా పనిచేస్తామని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాల్యవివాహాలపై నిఘా పెట్టాలని, పోలీసు, ఐసీడీఎస్ అధికారులతో సమన్వయంగా పనిచేసుకుంటూ బాల్యవివాహాలను నిర్మూలించాలన్నారు. అనంతరం అధికారులందరు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ అబ్దుల్ షకూర్, సీడీపీవో సుజాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.